


Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4784

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 36 | శనివారం 12 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## మోదీ, పుతిన్‌ల కీలక భేటీ

- వాణిజ్యం, ఇంధనం, పారిశ్రామిక సహకారం సహా పలు అంశాలపై చర్చ.
- ఇన్నోప్రోమ్ ఇండియాకు ప్రాధాన్యం
- ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చ
- పౌర అణు సహకారంపైనా దృష్టి




న్యూఢిల్లీ – సూర్య వాస్తవం:
బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ముందు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం న్యూఢిల్లీలో కీలక భేటీ అయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఇరువురు నేతలు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని పరస్పరం

- మిగతా 2లో..

## మోడీ బలహీన ప్రభుత్వమే కారణం

**- అమెరికా 'మిస్టర్ సింగ్' ప్రకటనపై కాంగ్రెస్ విమర్శలు**



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం:
భారతీయ ట్రక్ డ్రైవర్లకు వ్యతిరేకంగా అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం జారీ చేసిన ప్రకటనను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఈ ప్రకటన భారతీయులందరికీ అవమానమని, మోడీ బలహీనమైన ప్రభుత్వమే ఇలాంటి ప్రకటనకు కారణమని విమర్శించింది. భారతదేశ ప్రయోజనాలను సమర్థిస్తూ.. ఈ ప్రకటనపై అమెరికాను మోడీ ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించలేకపోతోందని, ఈ విషయంపై దేశ ప్రజలకు మోడీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పేర్కొంది. అమెరికా హోంలాండ్ సెక్యూరిటీ విభాగం ఎక్స్‌లో చేసిన పోస్టర్ తీవ్ర వివాదాస్పదంగా మారింది.

- మిగతా 2లో..



## పాఠశాలలో అగ్నిప్రమాదం

**- 29 మంది సజీవదహనం**

కాంగో– సూర్య వాస్తవం:
తూర్పు డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న బుకావులో రెండు పాఠశాలలో అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదం నుంచి తప్పించుకునే ప్రయత్నంలో జరిగిన తొక్కిసలాటలో కనీసం 29 మంది పాఠశాల విద్యార్థులు సజీవదహనమయ్యారని అధికారులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో పెద్దలు కూడా మరణించినట్లు సమాచారం.

- మిగతా 2లో..



## కాలపరిమితిపై స్పష్టత ఉండాలి

- ఆహార ఉత్పత్తుల హెచ్చరిక
- లేబుళ్లపై 10 రోజుల్లో అఫిడవిట్ : ఎఫ్ఎస్ఎస్ఎఐకి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం:
ఆహార ఉత్పత్తుల ప్యాకెట్లపై ముందు వైపు హెచ్చరిక లేబుళ్ళను ముద్రించేందుకు ఎఫ్ఎస్ఎస్ఎఐ (భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ)

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# వికృత రూపాలతో పోటీతత్వం

- రష్యా అధ్యక్షుడు పుతిన్
- స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం పెరగాలి : పెజెష్కియాన్
- ఆర్థిక వారధులను నిర్మిస్తున్న భారత్: బ్రిక్స్ బిజినెస్ ఫోరం సమావేశాల్లో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం:
20వ శతాబ్దం చివరి వరకు అగ్ర స్థానాల్లో వున్న దేశాల స్థానే కొత్తగా ఆవిర్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థలు వచ్చి చేరుతున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. ఈ పోటీ ఇప్పుడు వికృత రూపాలను అంటే సైనిక దాడులు, ఆంక్షల బెదరింపులు వంటి రూపాలను సంతరించుకుంటోందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రపంచంలో నిర్మాణాత్మకమైన, వ్యవస్థా గతమైన మార్పులకు లోనవుతోందని పుతిన్ అన్నారు. 20వ శతాబ్దం ద్వితీయార్థంలో ఆర్థిక అభివృద్ధికి అగ్రగామిగా నిలిచిన దేశాల స్థానే క్రమేపీ నూతన అభివృద్ధి చోదక శక్తులు ఆక్రమిస్తున్నాయని పుతిన్ పేర్కొన్నారు. అయితే ఈ దేశాలు ఇంకా బాగా అభివృద్ధి చెందిన మౌలిక సదుపాయాలను, సాంకేతి కతను, శాస్త్రీయ అవకాశాలను కలిగివు న్నాయనే వాస్తవాన్ని మనం గుర్తించాలన్నారు. మానవాళి స్వభావం, ఆర్థిక వ్యవస్థ రెండూ మార్పు చెందుతునే వుంటా యన్నారు. ఈ మార్పుతో పాటూ రష్యాకు చెందిన పశ్చిమ దేశాల పోటీదారులు తమ పూర్వపు పోటీ తత్వాన్ని తిరిగి సముపార్జించుకునేందుకు శాయశక్తులా పనిచేస్తున్నారని పుతిన్ పేర్కొన్నారు. అయితే ఈ పోటీతత్వం అనేది చాలాసార్లు వికృత చేష్టలతో ముడిపడి వుంటుందన్నారు. భౌతిక దాడులకు దిగడం, చమురు పైప్‌లైన్లు

- మిగతా 2లో..



## స్థానిక సంస్థల ఎన్నికలకు ఒత్తిడి పెరుగుతోంది

- 5 జీబీఏలలో 3 తప్పక గెలవాలి
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది సత్తా చాటే పరీక్ష!
- ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్

బెంగళూరు – సూర్య వాస్తవం
డి.కె. శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుంటున్న తరుణంలో, పంచాయతీలు, గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) మరియు ఇతర పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌పై ఒత్తిడి పెరుగుతోంది. కొత్త ప్రభుత్వానికి ఇదే మొదటి ప్రధాన ఎన్నికల సవాలు కానుంది. బెంగళూరు జీబీఏ పరిధిలోని సుమారు 6,000 గ్రామ పంచాయతీలు, 239 తాలూకా, 31 జిల్లా పంచాయతీలు మరియు ఐదు కార్పొరేషన్లలో ఎన్నికలు జరగనున్నాయి. మైసూరు, దావణగెరె, మంగళూరు, శివమొగ్గ మరియు తుమకూరు మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా ఎన్నికలు జరగాల్సి ఉంది. గత ఆరేళ్లుగా రాష్ట్ర రాజధానికి ఎన్నికైన

- మిగతా 2లో..

## డ్రోన్లతో వైద్యం, వ్యర్థాలతో సంపద..

- ఏపీ కలెక్టర్ల బెస్ట్ ఐడియాలు!
- 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఉత్తమ పాలనా విధానాలపై ప్రజెంటేషన్లు
- అల్లూరి జిల్లాలో డ్రోన్లతో మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు
- చిత్తూరులో డిజిటల్ విద్య, బాపట్లలో ఆటిజం విద్యార్థులకు ప్రత్యేక స్కూల్
- వ్యర్థాలతో సంపద, భూసారం పెంపుపై ప్రకాశం, సత్యసాయి జిల్లాల ప్రాజెక్టులు
- క్రీడలు, వ్యవసాయంలోనూ అనంతపురం, కర్నూలు జిల్లాల నూతన ఆవిష్కరణలు




అమరావతి – సూర్య వాస్తవం
రాష్ట్రంలో నిర్వహించిన 8వ కలెక్టర్ల సదస్సులో ఏడుగురు జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ పాలనా విధానాలను (బెస్ట్ ప్రాక్టీసెస్) ప్రజెంటేషన్ల ద్వారా వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో తాము చేపట్టిన వినూత్న కార్యక్రమాలను, వాటి ద్వారా సాధించిన సత్ఫలితాలను ఈ సదస్సులో వారు పంచుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'ప్రాజెక్ట్ డ్రోన్' పేరుతో మారుమూల గిరిజన ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా అత్యవసర ఔషధాలు, రక్త నమూనాలను సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ నిశాంతి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 20 వేల మందికి ప్రయోజనం చేకూరిందని తెలిపారు. అనంతపురం జిల్లాలో 'స్కూల్స్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్' ద్వారా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు.

బాపట్ల జిల్లాలో 'స్వర్ణ భవిత' పేరుతో ఆటిజం బాధితులైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా విద్య, వైద్యం, థెరపీ సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఓడీసీ–డిజిటల్

- మిగతా 2లో..



## రెండు డీఏలపై సర్కార్ కసరత్తు

- ఉద్యోగులకు పండుగ కానుక..
- పీఆర్సీపై ఉద్యోగ సంఘాలకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక హామీ.
- రెండు డీఏలకు రూ.6 వేల కోట్ల భారం
- ఈ నెల 18న సీఎస్‌తో ఉద్యోగ సంఘాల సమావేశం
- పీఆర్సీపై సీఎం కీలక హామీ
- దసరా నాటికి పీఆర్సీ అమలు చేయాలని విజ్ఞప్తి

హైదరాబాద్ – సూర్య వాస్తవం
తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించే దిశగా కసరత్తు

- మిగతా 2లో..

# మోదీ, పుతిన్‌ల కీలక భేటీ

(మొదటిపేజీ తరువాయి)

అభివాదం చేసుకున్నారు. అనంతరం ద్వైపాక్షిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. భారత్-రష్యా మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, పారిశ్రామిక సహకారం వంటి రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసే మార్గాలపై ప్రధానంగా చర్చించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా పారిశ్రామిక సహకారాన్ని విస్తరించడంపై ఇరువురు నేతలు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

భారత్‌లో తొలిసారిగా సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు నిర్వహించిన రష్యా అంతర్జాతీయ పారిశ్రామిక ప్రదర్శన ఇన్నోప్రోమ్ ఇండియా పై కూడా మోదీ, పుతిన్ చర్చించారు. భారత్-రష్యా వాణిజ్య, పారిశ్రామిక సంబంధాల విస్తరణకు ఈ ప్రదర్శన కీలకంగా నిలుస్తుందని వారు పేర్కొన్నట్లు సమాచారం. ఇరువురు నేతలు ప్రదర్శనను సందర్శించి పాల్గొన్న వారితో మాట్లాడారు. బ్రిక్స్‌లో భారత్-రష్యా భాగస్వామ్యంతో పాటు పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పశ్చిమాసియా, నల్ల సముద్ర ప్రాంతాల్లోని సంఘర్షణలు, సముద్ర వాణిజ్యంపై వాటి ప్రభావం, భారతీయ నావికుల భద్రత వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ భారత్-రష్యా మధ్య కొనసాగుతున్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు సమాచారం. పౌర అణు సహకారం కూడా సమావేశంలో కీలక అంశంగా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే రష్యాలో నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికుల రాకపోకలను విస్తరించడం, వారి భాగస్వామ్యాన్ని పెంచడం వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు చర్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

**రష్యా పర్యటనకు మోదీకి పుతిన్ ఆహ్వానం:**

24వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యేందుకు రష్యాను సందర్శించాలని అధ్యక్షుడు పుతిన్ ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని మోదీ అంగీకరించారు. ఇరుదేశాల దౌత్య మార్గాల ద్వారా పరస్పర సౌలభ్యానికి అనుగుణంగా శిఖరాగ్ర సమావేశ తేదీలను ఖరారు చేయనున్నారు. కాగా, 2026లో మోదీ, పుతిన్‌ల మధ్య జరిగిన రెండో సమావేశం ఇది. అంతకుముందు ఆగస్టు 31న బిష్కెక్‌లో జరిగిన 26వ ఎస్‌సీవో శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు సమావేశమయ్యారు.

# మోడీ బలహీన ప్రభుత్వమే కారణం

(మొదటిపేజీ తరువాయి)

ఆ పోస్టర్‌పై తలపాగాతో ఉన్న వ్యక్తికి ఎదురుగా ఒక రోబో నిల్చొని.. "మిస్టర్ సింగ్.. మా రోడ్లను వదిలిపెట్టండి. మీకు డ్రైవింగ్ రాదు" అని హెచ్చరించినట్టుగా ఉంది. పైగా "మీ అంతట మీరుగా దేశాన్ని వీడండి .. లేదంటే పర్యవసనాలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని అధికారులు ఆ పోస్టర్‌పై పేర్కొన్నారు.

# కాలపరిమితిపై స్పష్టత ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టనున్న రెండు దశల విధానాన్ని సుప్రీం కోర్టు పరిగణనలోకి తీసుకుంది. స్పష్టమైన కాలపరిమితి అంటూ లేకపోతే రెండో దశ నిరవధిక కాలం వాయిదా పడే అవకాశం వుందని హెచ్చరించింది. ఆహార లేబుళ్ల గురించి పిల్లలు కూడా తెలుసుకునేందుకు సాయపడేలా పాఠశాలల్లో పోషకాహారం గురించి అవగాహన తీసుకువచ్చే కార్యక్రమాలను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలించాలంటూ కేంద్రాన్ని కోర్టు కోరింది. ప్రతిపాదిత రెండు దశల విధానంలో ముందుగా రెండు లేదా అంతకంటే ఎక్కువ పదార్థాలు ఆందోళన కలిగించే స్థాయిలో వున్న అంటే అధికంగా కొవ్వు, చక్కెర, ఉప్పు వున్న ఆహార పదార్థాలకు ఈ హెచ్చరికలు వర్తింప చేస్తారు. ఆ తర్వాత ఒకటి ఎక్కువగా వున్నా కూడా ఆ ఉత్పత్తులపై హెచ్చరిక లేబుళ్ళు వేస్తారు. కొత్త లేబుళ్ళకు వినియోగదారులు అలవాటు పడేందుకు ఈ ప్రతిపాదిత విధానం కొంత సమయమిస్తుందని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ తెలిపింది. ఆహార పరిశ్రమ కూడా తన ఉత్పత్తులను తిరిగి రూపకల్పన చేసుకునేందుకు గడువు వుంటుందని పేర్కొంది. పిల్లలు ముఖ్యంగా ఏం తినాలో తినకూడదో సరైన అవగాహన లేకుండా ఆహార ఎంపిక చేసుకునే అవకాశం వుందని బెంచ్ అంగీకరించింది. అందువల్ల పాఠశాల సిలబస్‌లో పోషకాహారం గురించి తప్పనిసరిగా అవగాహన, చైతన్యం పెంచే కార్యక్రమాలు చేపట్టాలని కేంద్రాన్ని కోరింది. ప్యాకెట్ల లేబుళ్ళపై వున్న సమాచారాన్ని ఏ విధంగా అర్ధం చేసుకోవాలో కూడా వారికి తెలియజెప్పాలని కోరింది.

# పాఠశాలలో అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

జనసాంద్రత అధికంగా ఉండే కడుటు కమ్యూన్‌లో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రాణాలతో బయటపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. సోషల్ మీడియా దృశ్యాలలో పిల్లలు ఆసుపత్రి నేలలపై నొప్పితో పడి ఉండటం కనిపిస్తోంది. అగ్నిప్రమాదంలో సుమారు 300 ఇళ్లు కూడా ధ్వంసమయ్యాయని బాధితులు తెలిపారు. ఘోర ప్రమాదంపై సమాచారం తెలుసుకున్న వెంటనే ప్రభుత్వం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది.

# రెండు డీఏలపై సర్కార్ కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

స్కూల్ లెర్నింగ్' కార్యక్రమం కింద 22 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ వివరించారు. 'ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్' పద్ధతిలో తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోనూ సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి వివరించారు. ఈ విధానంలో జిల్లాలో ఇప్పటికే 1.94 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోందని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో 'వేస్ట్ టూ వెల్త్' ప్రాజెక్టు ద్వారా వ్యర్థాల నుంచి 'గ్రీన్ గోల్డ్' బ్రాండ్‌తో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. సత్యసాయి జిల్లాలో 'పునర్జీవం' ప్రాజెక్టు కింద బయోచార్‌తో భూసారాన్ని పెంచుతున్నామని, తద్వారా పర్యావరణాన్ని కాపాడుతున్నామని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వివరించారు.

# వికృత రూపాలతో పోటేతత్వం

(మొదటిపేజీ తరువాయి)

ధ్వంసం చేయడం, అంతర్జాతీయ రవాణా కారిడార్లను అడ్డుకోవడం, సముద్రపు నౌకలను స్వాధీనం చేసుకోవడం, అక్రమంగా ఇతరత్రా ఆంక్షలు విధించడం వంటి చర్యలకు దిగుతూంటారని అన్నారు.

**స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం పెరగాలి : పెజెష్కియాన్**

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కేవలం కొన్ని దేశాలపైనే ఆధారపడడం వల్ల ఎదురయ్యే ముప్పులు, ప్రమాదాల గురించి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రముఖంగా పేర్కొన్నారు. స్థానిక కరెన్సీల్లో బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం పెరగాలని పిలుపిచ్చారు. ఆర్థిక భద్రతను దేశ, ప్రాంతీయ భద్రత నుండి ఎలా వేరుచేయలేమో తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ జరిపిన దాడులు రుజువు చేశాయని అన్నారు. రాజకీయంగా ఒత్తిడి తీసుకురావడానికి ఆర్థిక సాధనాలను ఉపయోగించడం పెరిగిందని అన్నారు. ఈనాడు ప్రపంచం ఎదుర్కొంటున్న ఈ సవాళ్ళకు బ్రిక్స్ దేశాల స్పందన ఎలా వుండబోతోందో చెప్పాలని ఆయన అక్కడ వున్న నేతలను ఉద్దేశించి ప్రశ్నించారు. ఒక ఆర్థిక సాధనంపై లేదా సాంకేతికతపై గుత్తాధిపత్యాన్ని ప్రదర్శించడం ద్వారా ఏ దేశమూ మరో దేశం యొక్క చట్టబద్ధమైన వాణిజ్యాన్ని దెబ్బతీయలేని వాతావరణాన్ని బ్రిక్స్ సృష్టించాలని ఆయన కోరారు. ఇందుకు గానూ గ్లోబల్ సౌత్ దేశాల ఆర్థిక వ్యవస్థలు ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేలా వాటి అంతర్గత బలాన్ని పరిపుష్టం చేయాలన్నారు. ఆర్థికంగా ఎలాంటి దెబ్బలు తగిలినా, సంక్షోభాలు ఎదురైనా వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు అవసరమైన వనరులను, వ్యవస్థలను నిర్మించాల్సి వుందన్నారు.

**ఆర్థిక వారధులను నిర్మిస్తున్న భారత్**

ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అడ్డంకులు, అవరోధాలు పెరుగుతుండగా మరోపక్క భారత్ ఆర్థిక వారధులను నిర్మిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. "అడ్డంకులను తగ్గించడం, వ్యాపార, వాణిజ్యాలకు గల అవకాశాలను పెంపొందించడం ఇదొక్కటే తమ దృక్పథమని స్పష్టంచేశారు. 2014 నుంచి భారత్, దాదాపుగా 40దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుందని తెలిపారు. ఈ ఏడాది బ్రిక్స్‌దేశాల అధ్యక్ష స్థానం హోదాలో వ్యవసాయం, ఆరోగ్యం, నైపుణ్యాలు, స్మార్ట్ గ్రిడ్‌లు వంటి రంగాల్లో కొత్త సహకార నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ భారత మంటపంలో జరుగుతున్న బిజినెస్ ఫోరం సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్టార్టప్‌లను, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ)లను మార్కెట్లు, ఫైనాన్స్‌తో అనుసంధానించేం దుకు బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్, బ్రిక్స్ ఎంఎస్‌ఎంఈ పోర్టల్, స్టార్టప్ ఇన్నొవేషన్ ఫండ్ వంటి అదనపు చొరవలను భారత్ చేపట్టిందని తెలిపారు.

"సముద్రమార్గాలన్నీ సురక్షితంగా వున్నపుడు, సరఫరా మార్గాలు తెరిచివున్నపుడు, నావికులకు భద్రత వున్నపుడు మా త్రమే అంతర్జాతీయ వాణిజ్యం ముందుకు సాగుతుంది"అని మోడీ స్పష్టంచేశారు. మొత్తంగా ప్రపంచ జనాభాలో 50శాతం బ్రిక్స్ దేశాల్లోనే వున్నారని, అంతర్జాతీయ జీడీపీలో 40శాతం వాటా ఈ దేశాలదేనని, వాణిజ్యంలో 25శాతానికి పైగా వాటా ఈ దేశాలదేనని మోడీ గుర్తు చేశారు. "అదొక్కటే కాదు, ఇన్నేళ్ళలో అంతర్జాతీయ జిడిపి దాదాపుగా రెండున్నర రెట్లు పెరగగా, బ్రిక్స్ దేశాల సంయుక్త జీడీపీ ఏకంగా దాదాపు నాలుగున్నర రెట్లు పెరిగింది." అని మోడీ తెలిపారు. అంటే బ్రిక్స్ దేశాల ఆర్థిక శక్తిసామర్ధ్యాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ శక్తి సామర్ధ్యాలతో పోలిస్తే దాదాపుగా రెట్టింపుగా వుందన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికలకు ఒత్తిడి పెరుగుతోంది

(మొదటిపేజీ తరువాయి)

పాలకమండలి లేదు. ప్రభుత్వం బృహత్ బెంగళూరు మహానగర పాలికను ఐదు కార్పొరేషన్లుగా విభజించింది, అవి ఇప్పుడు జీబీఏలో భాగంగా ఉన్నాయి. అయినప్పటికీ, కొన్ని సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. జూన్ 3న శివకుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా, సుమారు రెండు వారాల తర్వాత కృష్ణ బైరే గౌడ బెంగళూరు అభివృద్ధి శాఖ బాధ్యతలు స్వీకరించారు. గుంతలు, శిథిలావస్థలో ఉన్న రోడ్లు, ట్రాఫిక్ రద్దీ, కలుషితమైన చెరువులు, సేకరించని చెత్త మరియు ఇతర పౌర సమస్యలను ఎదుర్కొంటున్న అధికార కాంగ్రెస్, రాష్ట్ర రాజధానిలో స్థానిక సంస్థల ఎన్నికలలో సవాలును ఎదుర్కొంటోంది. బెంగళూరులోని నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలకు (బెంగళూరు రూరల్‌తో సహా) బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తోంది నగరంలో అత్యధిక సంఖ్యలో ఎమ్మెల్యేలను కలిగి ఉంది. ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో మాట్లాడుతూ, ఒక సీనియర్ కాంగ్రెస్ సభ్యుడు బెంగళూరు ప్రజలు గత బీబీఎంపీ పాలనను మరిచిపోయారని అన్నారు. అనేక పౌర సమస్యల మధ్య, స్థానిక కౌన్సిలర్లు లేకపోవడం ప్రజలలో నిరాశను సృష్టించింది. మా ప్రభుత్వం ఐదు కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. వాటిలో కనీసం మూడింటిలోనైనా గెలవాల్సిన ఒత్తిడి మాపై ఉంది, ఇది ఒక సవాలు. ఇన్ని సంవత్సరాలుగా బెంగళూరులో ఒకే కార్పొరేషన్ ఉండేది. సాధారణంగా ఒకే పార్టీ అధికారంలోకి వచ్చేది. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓడిపోవడం రాష్ట్ర ప్రభుత్వానికి అవమానకరమని ఆయన అన్నారు. కర్ణాటక రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభించగా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు జీబీఏ ఎన్నికల విషయంలో ప్రభుత్వానికి కొంత సమయం ఉంది. గతంలో జీబీఏ ఎన్నికలకు జూన్‌ను గడువుగా నిర్ణయించిన సుప్రీంకోర్టు, ఓటర్ల జాబితాల ప్రత్యేక, విస్తృత సవరణ ప్రక్రియ కొనసాగుతున్న దృష్ట్యా, ఎన్నికల నిర్వహణ గడువును పొడిగించింది. ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం గడువును డిసెంబర్‌గా నిర్ణయించింది.

తమ జిల్లాల్లో అందుబాటులో ఉన్న బ్యాలెట్ పెట్టెల వివరాలను అందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పుడు అన్ని జిల్లా అధికారులను ఆదేశించింది.

# రెండు డీఏలపై సర్కార్ కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నట్లు తెలుస్తోంది. పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం డీఏ ల్లో కనీసం రెండు డీఏలను విడుదల చేసే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉద్యోగ సంఘాల నేతలు అసెంబ్లీలో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను ఆర్థిక శాఖ అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘాల నేతలు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగులకు మొత్తం ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, అందులో కనీసం మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కోరినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏల్లో తొలి డీఏకు సుమారు రూ.3,700 కోట్లు, రెండో డీఏకు దాదాపు రూ.2,300 కోట్ల ఆర్థిక భారం పడుతుందని అంచనా. రెండు డీఏలను మంజూరు చేస్తే ప్రభుత్వంపై ఏటా సుమారు రూ.6 వేల కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉందని ఆర్థిక శాఖ లెక్కలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. వచ్చే నెల 1వ తేదీ నుంచి పెరిగిన డీఏను జీతాల్లో కలిపి చెల్లిస్తే నెలకు సుమారు రూ.500 కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి.

డీఏల విడుదలపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాల నేతలు భావిస్తున్నారు. ఈ నెల 18న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఉద్యోగ సంఘాల సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆ సమావేశం సందర్భంగా డీఏపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. పీఆర్సీ విషయంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ సంఘాలకు సానుకూల హామీ ఇచ్చినట్లు సమాచారం. పీఆర్సీ నివేదిక అందిన తర్వాత దానిని పరిశీలించి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపినట్లు నేతలు వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన తర్వాత ఆర్థిక శాఖ అధికారులతో సమావేశమై రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సమీక్షించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణలో దసరా ప్రధాన పండుగ కావడంతో అప్పటి నుంచే పీఆర్సీ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాల నేతలు సీఎంను కోరినట్లు సమాచారం. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ రంజాన్ కూడా పెద్ద పండుగే కదా అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. దీంతో డీఏల విడుదలతో పాటు పీఆర్సీపై ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాలపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లలో ఆసక్తి నెలకొంది.

# శ్రీశైలం నీటిని కాపాడండి.. రాయలసీమ దప్పిక తీర్చండి...!

- జల నిర్వహణ వైఫల్యానికి ఎల్‌నినోను నిందించడం సరికాదు
- శ్రీశైలం నీటి భద్రతపై కృష్ణా బోర్డు ముందు ప్రభుత్వం గళం విప్పాలి: మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి
- ప్రాంతీయ అసమానతలకు తావులేకుండా నీటి పంపిణీ చేపట్టాలి: కె వి రమణ




**అనంతపురం - సూర్య వాస్తవం :**

కూటమి ప్రభుత్వం జల నిర్వహణలో విఫలమై, ఆ తప్పిదాలను ఎల్‌నినో పరిస్థితులపై నెట్టివేస్తోందని వై. విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో తాగునీటికి తొలి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, శ్రీశైలం జలాలను దిగువకు తరలించడం సరికాదన్నారు. సెప్టెంబర్ 9 నాటికి శ్రీశైలం ఎడమగట్టు, కుడిగట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా మొత్తం 78.66 టీఎంసీల నీరు దిగువకు తరలించారని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది భారీగా నీరు వచ్చినప్పటికీ శ్రీశైలం జలాశయంలో తగినంత క్యారీ ఓవర్ నిల్వ చేయకపోవడం ప్రస్తుత నీటి సంక్షోభానికి ఒక కారణమని ఆరోపించారు. శ్రీశైలం నీటి వినియోగంలో తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి కొరత ఉన్న సమయంలో విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని తరలించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని కృష్ణా నది యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాయలసీమతో పాటు ప్రకాశం, నెల్లూరు ప్రాంతాల నీటి భద్రతను దృష్టిలో ఉంచుకుని జల సంరక్షణ, ప్రాజెక్టుల నిర్మాణం, కాలువల పూర్తి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కృష్ణా డెల్టా అవసరాలపై స్పందిస్తున్న ప్రభుత్వం రాయలసీమ ప్రజల దప్పికపై కూడా అదే స్థాయిలో స్పందించాలని కె వి రమణ అన్నారు.

# సంపాదకీయం

## పెట్రో.. పసిడి.. రూపాయి.. చివరకు దారెటు?




దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే మడు కీలక అంశాలు ఒకేసారి ప్రతికూల దిశలో కదులుతున్నప్పుడు ఆందోళన చెందడం సహజం. పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి, పసిడి ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణత– ఈ మడు పరిణామాలు ప్రస్తుతం సామాన్యుడి నుంచి వ్యాపార వర్గాల వరకు ప్రతి ఒక్కరినీ కలవరపెడుతున్నాయి. వీటికి తోడు అంతర్జాతీయంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు, పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడిచమురు మార్కెట్‌లో అనిశ్చితి వంటి అంశాలు పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ప్రశ్న ఒక్కటే– పెట్రో.. పసిడి.. రూపాయి.. చివరకు దారెటు? చమురు ధరల పెరుగుదల అనేది కేవలం వాహనదారుల జేబుపై పడే భారం కాదు. అది ఆర్థిక వ్యవస్థలోని దాదాపు ప్రతి రంగాన్నీ తాకే ప్రభావశీలమైన అంశం. భారతదేశం తన ఇంధన అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగినప్పుడు దిగుమతి బిల్లు పెరుగుతుంది. అదే సమయంలో దేశీయ కరెన్సీ బలహీనపడితే, విదేశీ మారకంలో చెల్లించాల్సిన మొత్తం మరింత భారమవుతుంది. అంటే చమురు ధర పెరగడం ఒక సమస్య అయితే, రూపాయి విలువ పడిపోవడం ఆ సమస్యను రెట్టింపు చేసే ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఇంధన ధరల ప్రభావం రవాణా రంగంతో మొదలై వ్యవసాయం, పరిశ్రమలు, నిర్మాణ రంగం, సరఫరా వ్యవస్థ, రిటైల్ మార్కెట్ వరకు విస్తరిస్తుంది. లారీలు, బస్సులు, ట్యాక్సీలు, సరుకు రవాణా వాహనాల నిర్వహణ వ్యయం పెరిగితే దాని ప్రభావం చివరకు వస్తువుల ధరలపై పడుతుంది. రైతులకు డీజిల్ ధర పెరగడం అంటే సాగునీటి పంపులు, వ్యవసాయ యంత్రాలు, పంట రవాణా వంటి అనేక ఖర్చులు పెరగడమే. పరిశ్రమలకు ఇంధన వ్యయం పెరిగితే ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఉద్యమమే మందు ఉత్పత్తిదారుడు ఆ భారాన్ని పూర్తిగా భరించలేకపోతే వినియోగదారుడిపైనే కొంత భాగాన్ని మోపాల్సి వస్తుంది. ఇదే ద్రవ్యోల్బణానికి దారితీసే ప్రధాన మార్గాల్లో ఒకటి. ఇంధన ధరలు పెరిగినప్పుడు రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే ఆహారం నుంచి తయారీ వస్తువుల వరకు అనేక ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే చమురు ధరల కదలికను కేవలం పెట్రోల్ బంకుల వద్ద కనిపించే ధరలతో కొలవడం సరికాదు. దాని ప్రభావం కుటుంబ బడ్జెట్‌లోని అనేక అంశాలపై పరోక్షంగా కనిపిస్తుంది. ఇక రూపాయి విలువ విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే దిగుమతుల వ్యయం పెరుగుతుంది. చమురు మాత్రమే కాదు ఎలక్ట్రానిక్ పరికరాలు, యంత్రాలు, కొన్ని పారిశ్రామిక ముడి పదార్థాలు, రసాయనాలు, ఇతర దిగుమతి ఆధారిత వస్తువుల ధరలపైనా ప్రభావం పడుతుంది. అయితే రూపాయి పతనానికి అంతా ప్రతికూలమే అని చెప్పలేం. ఎగుమతిదారులకు కొంత ప్రయోజనం లభించే అవకాశం ఉంటుంది. కానీ దేశ ఆర్థిక వ్యవస్థలో దిగుమతుల ప్రాధాన్యం అధికంగా ఉన్న పరిస్థితుల్లో కరెన్సీ బలహీనత ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచే ప్రమాదం మాత్రం విస్మరించలేనిది. ఈ నేపథ్యంలో బంగారం మరో ప్రత్యేక కథ చెబుతోంది. సాధారణంగా అంతర్జాతీయ అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మార్కెట్లలో అస్థిరత పెరిగినప్పుడు పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గుచూపుతారు. బంగారానికి అలాంటి సమయంలో డిమాండ్ పెరగవచ్చు. దేశీయంగా రూపాయి బలహీనపడటం కూడా రూపాయి లెక్కల్లో బంగారం ధర పెరగడానికి కారణమయ్యే అవకాశం ఉంది. అందుకే ఒకవైపు స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు గురవుతుంటే మరోవైపు పసిడి ధరలు పైకి కదలడం కనిపిస్తుంది.బంగారం ధర ఎప్పుడూ ఒకే దిశలో పెరుగుతుందని భావించడం కూడా పొరపాటే. అంతర్జాతీయ వడ్డీ రేట్లు, అమెరికా డాలర్ బలం, కేంద్ర బ్యాంకుల విధానాలు, పెట్టుబడిదారుల సెంటిమెంట్, ప్రపంచ ఆర్థిక వృద్ధిపై అంచనాలు వంటి అనేక అంశాలు బంగారం ధరను ప్రభావితం చేస్తాయి. అందుకే రోజువారీ ధరల మార్పులను చూసి భయపడటం కన్నా, దీర్ఘకాలిక ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడం అవసరం. మరోవైపు స్టాక్ మార్కెట్లలో కనిపిస్తున్న ఒడిదుడుకులు కూడా ఈ సవికరణంలో భాగమే. ముడిచమురు ధరలు పెరిగితే దిగుమతి ఆధారిత కంపెనీల ఖర్చులు పెరిగే అవకాశం ఉంటుంది. రూపాయి బలహీనపడితే విదేశీ మారకపు రుణాలు లేదా దిగుమతులపై ఆధారపడే సంస్థలపై ఒత్తిడి రావచ్చు. అదే సమయంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను తగ్గిస్తే మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరగవచ్చు. అయితే కొన్ని ఎగుమతి ఆధారిత రంగాలకు బలహీన రూపాయి అనుకూలంగా మారే అవకాశమ ఉంది. కాబట్టి మార్కెట్‌లో ప్రతి రంగం ఒకే విధంగా ప్రభావితమవుతుందని భావించడం సరికాదు. అందువల్ల పెట్రో, పసిడి, రూపాయి అనే మడు సూచికలను విడివిడిగా చూడటం కన్నా వాటి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. చమురు ధరలు పెరిగితే దిగుమతి బిల్లు పెరుగుతుంది; దిగుమతి బిల్లు పెరిగితే రూపాయిపై ఒత్తిడి రావచ్చు; రూపాయి బలహీనపడితే దిగుమతులు మరింత ఖరీదవుతాయి; అంతర్జాతీయ అనిశ్చితి పెరిగితే బంగారం వైపు పెట్టుబడులు మళ్లవచ్చు; మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింటే స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతాయి. ఈ పరిణామాలన్నీ చివరకు సామాన్యుడి జీవన వ్యయంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కాబట్టి నేటి పరిస్థితి కేవలం ధరల పెరుగుదల కథ కాదు –ఆర్థిక స్థిరత్వానికి ఎదురవుతున్న పరీక్ష. తాత్కాలిక ఉపశమన చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇది. పెట్రో మంటను తగ్గించాలి, రూపాయి విలువను నిలబెట్టే ఆర్థిక పునాదులను బలోపేతం చేయాలి, పసిడి ధరల ఊగిసలాట వెనుక ఉన్న అంతర్జాతీయ అనిశ్చితిని అర్థం చేసుకోవాలి. అప్పుడే ద్రవ్యోల్బణం నుంచి సామాన్యుడికి ఉపశమనం లభిస్తుంది. ప్రపంచ పరిణామాలు మన తలుపు తట్టకముందే వాటి ప్రభావాన్ని అంచనా వేసి సిద్ధపడటమే సమర్థ ఆర్థిక పాలన. లేకపోతే పెట్రో మంట, పసిడి మెరుపు, రూపాయి పతనం మడూ కలిసి దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త సవాలుగా మారే ప్రమాదం ఉంది. ప్రశ్న దారెటు? అనేదే కాదు; సరైన దారిని ఇప్పుడే ఎంచుకోగలమా? అన్నదే అసలు ప్రశ్న




# సమాజం ఎటుపోతుంది..?

- విద్యాబుద్ధులు నేర్పాల్సిన చోట అసభ్య ప్రవర్తన..!
- కొంతమంది ఉపాధ్యాయుల తీరుతో మొత్తం ఉపాధ్యాయ వృత్తికే చెడ్డపేరు
- కల్యాణదుర్గం నార్త్ జెడ్పీ పాఠశాలలో కలకలం
- విద్యార్థినిపై అసభ్య ప్రవర్తన... ఉపాధ్యాయుడికి తల్లిదండ్రుల దేహశుద్ధి
- ఉపాధ్యాయుడిపై కేసు నమోదు.. పోలీసుల అదుపులో నిందితుడు
- పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**అనంతపురం – సూర్య వాస్తవం ప్రత్యేక కథనం :** కొంతమంది ఉపాధ్యాయుల తీరుతో మొత్తం ఉపాధ్యాయ వృత్తికే చెడ్డపేరు పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు మంచి నడవడిక, విలువలు నేర్పాల్సిన కొంతమంది ఉపాధ్యాయులే విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగులోకి రావడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కొంతమంది వ్యక్తుల అనుచిత ప్రవర్తన కారణంగా నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులందరికీ చెడ్డపేరు వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు విద్యార్థులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాల్సిన ప్రదేశాలని, అక్కడే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఆడపిల్లలను పాఠశాలలకు పంపే విషయంలో తల్లిదండ్రులకు భద్రతపై నమ్మకం కలిగేలా విద్యాశాఖ అధికారులు, పోలీసులు, పాఠశాల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.విద్యార్థినులతో అనుచితంగా ప్రవర్తించే వారిని గుర్తించి, ఫిర్యాదులపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిర్ధారణైతే చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు అవసరమైన పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కల్యాణదుర్గం నార్త్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థిని పట్ల ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలు కలకలం రేపాయి. ఈ ఘటనకు సంబంధించి ఉపాధ్యాయుడు రామచంద్ర నాయక్‌పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడిని నిలదీసి దాడి చేసి అనంతరం పోలీసులకు అప్పగించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఘటనపై సమగ్ర శాఖాపరమైన విచారణ చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే పోలీసుల దర్యాప్తు, శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా కాకుండా ఆరోపణలుగానే పరిగణించాల్సి ఉంటుంది. విచారణలో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా తదుపరి చర్యలు ఉండనున్నాయి.

# సచివాలయాల్లో సర్వర్ కష్టాలు

- మీ-సేవ కేంద్రాల్లో వృద్ధుల అవస్థలు
- పెన్షన్ దరఖాస్తుల గడువు పెంచాలి
- అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి(కె.రహీం)

**పామిడి – సూర్య వాస్తవం :** రాష్ట్రంలో కొత్తగా సామాజిక భద్రతా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు,ఒంటరి మహిళలు, వికలాంగులు, డప్పు కళాకారులు తదితర అర్హత కలిగిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సిపిఐ సీనియర్ నాయకుడు జిల్లా కార్యవర్గ సభ్యులు కే రహీం పేర్కొన్నారు. శుక్ర వారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 3ఏళ్లుగా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, డప్పు కళాకారులు తమకు పెన్షన్ వస్తుందనే ఆశతో సచివాలయాలు, మీ–సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే వారికి అవసరమైన అర్హత పత్రాలు, ధ్రువపత్రాలు పొందడంలో తీవ్రజాప్యం జరుగు తోందని, కొన్ని సచివాలయాల్లో కంప్యూటర్లు పనిచేయకపోవడం, సర్వర్ సమస్యలు, సాంకేతిక లోపాలు ప్రజలకు మరింత ఇబ్బందికరంగా మారాయి. కొన్ని చోట్ల సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల కూడా దరఖాస్తుదారులు గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడుతోందని, ప్రధానంగా వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, వికలాంగులు కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రభుత్వం నిర్ణయించిన గడువు సమీపిస్తుండగా సర్వర్లు పనిచేయకపోవడం, కంప్యూటర్ల సమస్యలు, విద్యుత్ సమస్య,అధికారుల అందుబాటులో లేకపోవడం వల్ల అర్హులైన అనేక మంది దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని, వీటన్నిటికీ తోడు వినాయకచవితి పండుగ సెలవులు, సమావేశాలు క్యాంపులు కారణంగా కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే సమయం తగ్గిపోవడంతో పెన్షన్ల దరఖాస్తుదారులపై మరింత గడువు ఒత్తిడి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు.

పెన్షన్ దరఖాస్తులకు ప్రభుత్వం ప్రకటించిన చివరి గడువును తక్షణమే పొడిగించాలని, సర్వర్, కంప్యూటర్, సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి అన్ని సచివాలయాలు, సంబంధిత కేంద్రాల్లో సేవలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూడాలని, పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, డప్పు కళాకారులు తదితరులకు అవసరమైన అర్హత పత్రాలు, ధ్రువపత్రాలు సకాలంలో అందేలా అధికారులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ, సచివాలయాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లా, మండల స్థాయి



అధికారులు ప్రత్యేకపర్యవేక్షణ ఉండాలని,సాంకేతిక సమస్యల కారణంగా గడువులో దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులకు మరింత అవకాశం కల్పించాలని, ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రత్యేక సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పెన్షన్ల మంజూరులో ఎలాంటి రాజకీయ జోక్యం, వివక్ష ఉండకూడదని, రాజకీయ పార్టీలకు అనుబంధాలకు అతీతంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పెన్షన్ అందేలా చూడాలని, ఆయన డిమాండ్ చేశారు.పెన్షన్ల గడువు పెంచి ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కే రహీం, కోదండరామిరెడ్డి, చౌడప్ప, రాముడు, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకుందాం...!

- భక్తిశ్రద్ధలతో.. బాధ్యతగా.. నిబంధనలు పాటిద్దాం
- మంటపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి: అర్బన్ డీఎస్పీ ఎం. చంద్రశేఖర్




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కోవాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు సూచించారు. అనంతపురం నగర గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, సభ్యులతో పోలీసుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ డీఎస్పీ ఎం. చంద్రశేఖర్ ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సిన భద్రతా నిబంధనలపై పలు సూచనలు చేశారు.గణేష్ మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ప్రధాన మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్, అగ్నిమాపక భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.నిర్ణీత సమయం తర్వాత మైక్ సెట్లు, డీజేలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. శిక్షణ పొందిన వాలంటీర్లను ఏర్పాటు చేసి మండపాల వద్ద 24 గంటల పాటు పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జన ఊరేగింపులను పోలీసులు సూచించిన మార్గాల్లోనే నిర్వహించాలని, నిబంధనలను ఉల్లంఘించకుండా నిర్వాహకులు సహకరించాలని డీఎస్పీ కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. భక్తిశ్రద్ధలతో.. బాధ్యతగా.. ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలను జరుపుకుందామని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు.

## స్థానిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సిద్ధం కావాలి...!

- క్లస్టర్, యూనిట్ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలి
- ఎన్నికల విజయమే మన లక్ష్యం:ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపు నిచ్చారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ దేవేంద్రప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. ప్రతి క్లస్టర్, యూనిట్ స్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు.

## ఉపాధి హామీ కూలీలకు... ఆన్‌లైన్ మోసాలపై అవగాహన...!

- సైబర్ సురక్ష వాహనం ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు, నీలారెడ్డిపల్లి గ్రామాల్లో 'సైబర్ సురక్ష వాహనం' ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు సైబర్ మోసాలు, ఆన్‌లైన్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. అలాగే మహిళల భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన, బాల్య వివాహాల నివారణపై కూడా అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్, అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయాలని తెలిపారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ -- 1972కు తెలియజేయాలని సూచించారు. అప్రమత్తతే సైబర్ నేరాలకు తొలి రక్షణ అని పోలీసులు పేర్కొన్నారు.

## ఆదర్శ విద్యానికేతన్‌లో వినాయక చవితి వేడుకలు

- మట్టి వినాయకులను తయారు చేసి సంబరాలు జరుపుకున్న చిన్నారులు



**పెద్దవడుగూరు –సూర్య వాస్తవం:** స్థానిక ఆదర్శ విద్యానికేతన్ పాఠశాలలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు పర్యావరణ అనుకూల మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల జరిగే కాలుష్యాన్ని అరికట్టాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ సంబరాలలో పాఠశాల చిన్నారులు ఎంతో భక్తిశ్రద్ధలతో, సృజనాత్మకతతో తమ చిన్నారి చేతులతో అందమైన మట్టి గణపతులను తీర్చిదిద్దారు. తాము తయారుచేసిన విగ్రహాలకు పత్రాలు, సహజసిద్ధమైన పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన శ్లోకాల పఠనం, సాంస్కృతిక ప్రదర్శనలు పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కరణం నారాయణరావు మాటాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో మన సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. చిన్నారులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండి, మట్టి గణనాథుడిని పూజించడం ద్వారా సమాజానికి గొప్ప సందేశాన్ని ఇచ్చారని కొనియాడారు. చిన్న వయసులోనే విద్యార్థుల్లో ఇలాంటి పర్యావరణ స్పృహను పెంపొందించడం ఎంతో అభినందనీయమని ఆయన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

# సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్...!
- అర్హులందరూ పింఛన్లకు దరఖాస్తు చేసుకునేలా చూడాలి
- స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలి
- అన్ని స్థానాల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి
- పార్టీకి విధేయంగా పనిచేసే వారికే గుర్తింపు -- అబ్జర్వర్ దేవేంద్రప్ప




**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల దరఖాస్తులపై పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అబ్జర్వర్ దేవేంద్రప్పతో పాటు క్లస్టర్, డివిజన్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ పింఛన్లపై అవగాహన కల్పించాలి

ఈ నెల 16వ తేదీ వరకు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి ఒక్కరికీ సమాచారం చేరేలా క్షేత్రస్థాయి నాయకులు పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పింఛన్ల విషయంలో ఎలాంటి రాజకీయ వివక్ష ఉండదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ మరో మూడు లక్షల పింఛన్లు మంజూరు చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు.

### స్థానిక ఎన్నికలపై దృష్టి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నాయకుడు, కార్యకర్త వచ్చే రెండు నెలలు ప్రజల్లోనే ఉండి పనిచేయాలని దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లు 62 స్థానాలకు పెరిగే అవకాశం ఉందని, టికెట్లు ఆశిస్తున్న వారితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

### పార్టీకి విధేయతే ప్రాధాన్యం

పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే తనతో చర్చించి పరిష్కరించుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. అయితే పార్టీలో ఉంటూనే ప్రత్యర్థులకు ప్రయోజనం చేకూర్చే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి విషయాల్లో మంత్రి నారా లోకేష్ చాలా సీరియస్‌గా ఉంటారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సందేహాలు ఉంటే కోఆర్డినేటర్‌గా నియమితులైన బుగ్గయ్య చౌదరిని సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.

### కార్యకర్తల కృషికి గుర్తింపు

పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా గుర్తింపు, పదవులు లభిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. తాను సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి ఎంపీటీసీ నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగినట్లు పేర్కొంటూ, పార్టీ పట్ల విధేయతతో పనిచేయడమే దీనికి కారణమన్నారు.

### టీడీపీ కన్నతల్లిలాంటిది

అబ్జర్వర్ దేవేంద్రప్ప మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కన్నతల్లిలాంటిదని, పార్టీని నమ్ముకున్న వారు ఎప్పటికీ నష్టపోరని అన్నారు. తాను కూడా సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఎదిగానని, గతంలో అనేక స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాలు సాధించానని తెలిపారు. పార్టీ గుర్తించి తనకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ఎమ్మెల్యే కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని దేవేంద్రప్ప పేర్కొన్నారు.

# స్థానిక పోరుకు సిద్ధం కండి...

- తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపు...!
- గ్రామ గెలుపే లక్ష్యం.. వైసీపీ శ్రేణులకు దిశానిర్దేశం
- రైతు సమస్యలపై సమరశంఖం. స్థానిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ సిద్ధం
- గ్రామాల్లో గెలుపే లక్ష్యం.. వైసీపీ కదం తొక్కాలి
- పేరూరు డ్యామ్‌కు నీరేదీ..? ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- స్థానిక సమరానికి వైసీపీ రెడీ..!!



**అనంతపురం – సూర్య వాస్తవం :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాప్తాడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి ప్రజలకు అందుబాటులో ఉండే బలమైన, సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసి, వారి విజయానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఇవి సాధారణ ఎన్నికలు కావు.. కచ్చితంగా గెలవాల్సిన ఎన్నికలు. ప్రతి స్థానంలో సరైన అభ్యర్థిని నిలబెట్టి గెలిపించాలి. పార్టీ శ్రేణులకు పూర్తి అండగా ఉంటాం" అని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

### రైతుల సమస్యలపై పోరాటం

నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రకాష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులతో బోర్లు ఎండిపోవడం, కరువు తీవ్రత పెరగడం, సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హంద్రీ-నీవా కాలువల అభివృద్ధి, లైనింగ్ పనులు, భూగర్భ జలాల పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పేరూరు డ్యామ్‌కు నీటిని అందించాలని, రాప్తాడు నియోజకవర్గంతో పాటు రొద్దం, పెనుకొండ మండలాల రైతుల సాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇసుక అక్రమ రవాణాను అరికట్టి భూగర్భ జలాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు సాగునీరు, విద్యుత్, గిట్టుబాటు ధరలు, కరువు సమస్యల నుంచి ఉపశమనం కల్పించేందుకు ప్రజల తరఫున నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు అండగా నిలిచి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు.




# ప్రజా సమస్యల పరిష్కారమే... కూటమి ప్రభుత్వ లక్ష్యం...!

- ప్రజల అర్జీలపై తక్షణ చర్యలు తీసుకోవాలి
- సంబంధిత శాఖలకు సమస్యలు పంపించి పరిష్కారానికి ఆదేశాలు
- ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో 58వ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నేరుగా అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ప్రజలు తమ వ్యక్తిగత, స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య తీవ్రత, ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సం బంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

### మట్టి వినాయకుని పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం

భక్తితో బొజ్జ గణపయ్యను ఆహ్వానిద్దాం.. బాధ్యతతో పర్యావరణాన్ని పరిరక్షిద్దామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా నిర్వహించాలని సూచించారు.

### గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

భక్తుల సౌకర్యార్థం గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ తెలిపారు. మండపాల నిర్వాహకులపై విద్యుత్ ఖర్చుల భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. గణేష్ మండపాల్లో పండుగ సందడి సాఫీగా సాగేందుకు నిర్వాహకులకు అవసరమైన సహకారం అందించాలని సంబంధిత అధికారులను కోరారు.

## పామిడి ఆదర్శ పాఠశాల విద్యార్థికి అరుదైన అవకాశం

**- ఛత్తీస్‌గఢ్‌లో జరిగే అంతర్జాతీయ రెజ్లింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు కొప్పల అనూష ఎంపిక - పాఠశాల ఉపాధ్యాయుల ఆర్థిక సహాయం**



**పామిడి – సూర్య వాస్తవం :** స్థానిక పట్టణ పరిధిలో ఉన్నటువంటి ఆదర్శ పాఠశాల విద్యార్థిని కొప్పల అనూష అంతర్జాతీయ స్థాయి రెజ్లింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (స్గఫాప్ ) ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ లో జరగనున్న అంతర్జాతీయ రెజ్లింగ్ సెలక్షన్ ట్రయల్స్ కు ఆమె హాజరుకానుంది. అనంతరం ఎంపికైతే దక్షిణ అమెరికా రియో బ్రెజిల్ లో జరిగే అంతర్జాతీయ పోటీలకు వెళ్లే అవకాశం ఉంది.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అనూష ప్రయాణ ఖర్చుల నిమిత్తం 11,500/ లను ఆర్థిక సహాయంగా అందించి ప్రోత్సహించారు.పాఠశాల ప్రిన్సిపాల్ వై. అరుణ, పి ఈ టి , నరేష్ తోటి ఉపాధ్యాయులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎయిడ్స్ నియంత్రణలో అనంతపురం జిల్లాకు సాక్ష్యం అవార్డు...!

**- 95-95-95 లక్ష్యాల సాధన దిశగా జిల్లా పురోగతి**

**- సంఘర్షశీల్ స్థితి నుంచి సక్షం స్థాయికి చేరిక**

**- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను అభినందించిన అధికారులు**




**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం :** ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో అనంతపురం జిల్లా సాక్ష్యం స్థాయికి చేరుకోవడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. 2030 నాటికి హెచ్ఐవీ నియంత్రణలో 95–95–95 లక్ష్యాలను సాధించాలని యుఎన్ఎ ఐడిఎస్ నిర్దేశించింది. ఇందులో భాగంగా హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందిని గుర్తించడం, గుర్తించిన వారిలో 95 శాతం మందికి చికిత్స అందించడం వంటి లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లాలు సాధిస్తున్న ప్రగతి ఆధారంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వాటిని సంఘర్షశీల్, సక్షం, సురక్షిత్, సురక్షిత్ ప్లస్ తదితర స్థాయిలుగా విభజించింది. ఈ క్రమంలో సంఘర్షశీల్ స్థితి నుంచి సాక్ష్యం స్థాయికి అనంతపురం జిల్లా చేరుకుంది.ఈ నెల 8న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ స్మరణ్ రాజ్, ఐఏఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లాల వారీగా ప్రగతిని సమీక్షించారు. అనంతపురం జిల్లా సాధించిన పురోగతిని గుర్తించి సక్షం అవార్డుతో అభినందిస్తూ జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ జయలక్ష్మి, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరత్నం, సీపీఓ రమణలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ఛాంబర్‌లో కలిసి జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో సాధించిన పురోగతిని వివరించారు.జిల్లా సాధించిన ప్రగతిపై డీఎంహెచ్ఓ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు అధికారులను అభినందించారు. భవిష్యత్తులోనూ ఎయిడ్స్ నియంత్రణ సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేసి, కార్యక్రమాల్లో మరింత పురోగతి సాధించాలని సూచించారు.

## మట్టి వినాయకులను వాడి పర్యావరణాన్ని కాపాడుదాం

**- కృష్ణవేణి స్కూల్లో ఘనంగా మట్టి వినాయకులాన్ని తయారు చేస్తున్న చిన్నారులు**




**పామిడి – సూర్య వాస్తవం :** స్థానిక కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా మరియు సాంప్రదాయబద్ధంగా జరిగాయి. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పాఠశాల యాజమాన్యం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు ప్రత్యామ్నా యంగా మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించింది.ఈ వేడుకల్లో పాఠశాల చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, తమ చేతులతో స్వయంగా అందమైన మట్టి వినాయక రూపాలను తీర్చిదిద్దారు. విగ్రహాలను తయారు చేయడమే కాకుండా, వాటికి సహజసిద్ధమైన పూలు, ఆకులతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణపతి బప్పా మోరియా అంటూ చేసిన జయ జయ ధ్వనులు పాఠశాల ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాం డెంట్ ఆర్.అనురాధ రెడ్డి మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పిల్లల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. చిన్నారులు ఎంతో భక్తిశ్రద్ధలతో, సృజనాత్మకతతో మట్టి గణపతులను తయారు చేయడం అభినందనీయమని కొనియాడారు.సాంప్రదాయాలను గౌరవిస్తూ పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పిలుపునిచ్చారు.

# వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ : ఎమ్మెల్యే కాలవ

**- ఆరు మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే**




**కనేకల్ – సూర్య వాస్తవం:** సాంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కనేకల్లు మండలం పూలచర్లలో మెయిల్ కంపెనీ ఏర్పాటు చేసిన 6 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును శు క్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నీరు, బొగ్గు వంటి సంప్రదాయ ఇంధన వనరుల ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేయడంలో అనేక అవరోధాలు ఎదురవుతున్నాయన్నారు. అందువల్ల గాలి, సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వీటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడంతో పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని భారీగా పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా 500 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 160 గిగావాట్ల సామర్థ్యంతో సాంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారని వివరించారు. ఇందుకోసం సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడానికి ఆయన కృషి చేస్తున్నార



న్నారు. ఇందులో భాగంగా రాయదుర్గం నియోజక వర్గంలో 7,500 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్‌టీపీసీ ద్వారా 1,100 మెగావాట్లు, జిందాల్ ద్వారా 800 మెగావాట్లు, టాటా పవర్ మరో 400 మెగావాట్ల సామర్థ్యంతో పాటు ఇతర కంపెనీలను కలుపుకొని మొత్తం 7,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్నామన్నారు. రాబోయే మూడు నాలుగేళ్లలో నియోజకవర్గంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో స్థానిక అవసరాలకు వినియోగించిన అనంతరం మిగిలిన కరెంటును విశాఖపట్నం తదితర ప్రాంతాలకు సరఫరా స్థాయికి రాయదుర్గం చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో మెయిల్ కంపెనీ 110 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, అందులో రాయదుర్గం నియోజకవర్గంలోనే 48 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ముఖ్యంగా పగటిపూట ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను బ్యాటరీల్లో నిల్వ చేసి రాత్రి వేళల్లో వినియోగించుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. మెయిల్ కంపెనీ కనేకల్లులో 6 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంటు ద్వారా కణేకల్లు మండలంలో వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు మరింత అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న 12 వేల వ్యవసాయ పంపుసెట్లకు రోజుకు తొమ్మిది గంటల పాటు విద్యుత్ అందించేందుకు 2.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరమవుతుందని, అందులో రాబోయే మూడేళ్లలో 1.5 మిలియన్ యూనిట్లను స్థానికంగానే ఉత్పత్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. సాంప్రదాయేతర ఇంధన విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించాలని ఎమ్మెల్యే కాలవ కోరారు. రాష్ట్ర ప్రగతి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై పల్లెల్లో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి పడుతున్న శ్రమను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు చంద్రబాబు నాయుడు మరో 15 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలని ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వన్నారెడ్డి, ఆనంద్, లాలెప్ప, సుదర్శన్, బసవరాజు, రమేష్, చాంద్ భాషా, వెంకటేశు లు, నవీన్, అనిల్, రుద్రముని ఎంపిటిసి నరేంద్ర, జయరాం చౌదరి, శరభన గౌడ్,నగేష్ రెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం స్పోర్ట్స్ మోడల్‌కు సీఎం ప్రశంసలు...!

**- రాష్ట్రవ్యాప్తంగా అమలుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశం**

**- గ్రామీణ క్రీడా ప్రతిభను వెలికితీసేలా వినూత్న కార్యక్రమం**

**- కలెక్టర్ ఓ. ఆనంద్‌ను ప్రత్యేకంగా అభినందించిన ముఖ్యమంత్రి**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో అనంతపురం జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న డిస్ట్రిక్ట్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ మోడల్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలు కురిపించారు. ఈ వినూత్న విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజు సమావేశంలో అనంతపురం జిల్లా కలెక్టర్ డా. ఓ. ఆనంద్ జిల్లా స్పోర్ట్స్ మోడల్‌పై ప్రజెంటేషన్ ఇచ్చారు. పాఠశాల స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను గుర్తిస్తున్నట్లు వివరించారు.పాత పద్ధతిలోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ( ఎస్జిఎఫ్ ) తరహా ఎంపిక ట్రయల్స్‌కు పరిమితం కాకుండా, విద్యార్థు లందరికీ క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పించామని కలెక్టర్ తెలిపారు. గతంలో సుమారు 1,600 మంది విద్యార్థులు మాత్రమే పాల్గొనగా, కొత్త విధానంలో జిల్లాలోని 544 పాఠశాలల నుంచి 25,048 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. వీరిలో సుమారు 45 శాతం మంది బాలికలు ఉన్నట్లు వివరించారు.అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, జూడో తదితర 8 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం కార్యక్రమానికి రూ.20 లక్షల నిధులను వినియోగించినట్లు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అదనపు ఆర్థిక భారం లేకుండా పోటీలను నిర్వహించినట్లు వివరించారు.విద్యార్థుల రవాణాకు బాలికలకు 'స్త్రీశక్తి' ఉచిత బస్సు ప్రయాణం, బాలురకు ప్లాన్ చేసిన పాస్‌లను వినియోగించామని, క్రీడా మైదానాల అభివృద్ధికి జీరామ్‌జీ సహకారం పొందామని కలెక్టర్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం, పీఈటీలు, క్రీడా శాఖ కోచ్‌ల సేవలను వినియోగించినట్లు చెప్పారు. ఆర్డీటీ క్రీడా ప్రాంగణాలతో పాటు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల సహకారం, సీఎస్ఆర్ నిధులతో పతకాలు, షీల్డ్‌లు అందించినట్లు వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ అనంతపురం జిల్లా కలెక్టర్ వినూత్నంగా రూపొందించిన స్పోర్ట్స్ మోడల్‌ను అభినందించారు. విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను చిన్న వయస్సులోనే గుర్తించి అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సూచించారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో బలమైన క్రీడా వ్యవస్థను అభివృద్ధి చేయాలని విద్యాశాఖ మంత్రి, శాప్ అధికారులను సీఎం ఆదేశించారు. నర్సరీ కాన్సెప్ట్, ప్రతిభ గుర్తింపు, క్రీడా ఈవెంట్లు, నైపుణ్యాల బెంచ్‌మార్కింగ్, నిరంతర శిక్షణతో కూడిన సమగ్ర కార్యాచరణను రూపొందించాలని సూచించారు. జిల్లా స్థాయిలో బాలురు, బాలికలకు ప్రత్యేక రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్స్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని, అమరావతి, విశాఖపట్నం, తిరుపతిని ప్రధాన స్పోక్ హబ్‌లుగా అభివృద్ధి చేసి అన్ని జిల్లాలను అనుసంధానించేలా 'హబ్ అండ్ స్పోక్' మోడల్ అమలు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఖేలో ఇండియా, స్కూల్ ఎడ్యుకేషన్, శాప్ నిధులతో పాటు పీపీపీ, సీఎస్ఆర్, కేంద్ర ప్రభుత్వ నిధులను అనుసంధానం చేసి క్రీడా కార్యక్రమాలను శాశ్వత ప్రాతిపదికన కొనసాగించాలని సూచించారు.

# మహిళలు, విద్యార్థినుల భద్రతే లక్ష్యం...!

**- విద్యార్థినులు, మహిళల భద్రతపై శక్తి టీం ప్రత్యేక అవగాహన సదస్సు**




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** మహిళలు, విద్యార్థినుల భద్రతపై అవగాహన కల్పించేందుకు అనంతపురం రూరల్ సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాలల్లో చోటుచేసుకుంటున్న దురదృష్టకర సంఘటనల నేపథ్యంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని పోలీసులు వివరించారు. సదస్సులో శక్తి యాప్ వినియోగం, అత్యవసర సమయంలో 100, 112, 1098, 181 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించే విధానం గురించి అవగాహన కల్పించారు. అలాగే ఓటీపీ లు, ఫేక్ కాల్స్, సోషల్ మీడియా మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.పోక్సో చట్టం, బాల్య వివాహాలు, మహిళలపై జరిగే నేరాలపై చట్టపరమైన అంశాలను వివరించారు. అవసరమైన వారికి ఫ్యామిలీ కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అప్రమత్తతే రక్షణ.. భద్రతే మా బాధ్యత అని శక్తి టీం పేర్కొంది.

## అతివేగంతో ఆటోను ఢీకొన్న పాల ట్యాంకర్

-ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు..

- మరో కొంతమందిని హాస్పిటల్ తరలింపు



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** 10మందితో ప్రయాణిస్తు పండ్లూరు క్రాస్ రోడ్డు పక్కన ఆగి ఉన్న ఓ పాసెంజర్ ఆటోను శుక్రవారం పాల టాంకర్ ఢీకొనడంతో అక్కడికక్కడే ఒకరు మృతి, చెందగా మరో కొంతమందికి తీవ్ర గాయాలు అయినా సంఘటన చోటుచేసుకుంది.పోలీసుల వివరాల మేరకు విజయవాడ నుండి పలమనేరు వెళుతున్న మోడల్ సంస్థకు చెందిన ఏపీ 16టీజీ 3277 గల పాల వాహనం లారీ పండ్లూరు క్రాస్ రోడ్స్ సమీపంలోని కిన్నెర నేషనల్ జాతీయ రహదారి 16 హోటల్ వద్ద పదిమంది కూలీలతో ఆగి ఉన్న ఆటోను వెనక నుండి పాల లారీ బలంగా ఢీకొనడంతో జరిగిన సంఘటన స్థలంలోని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారికి తీవ్ర గాయాలు కాక ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు ఓజీల మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన వారిగా స్థానికులు చెబుతున్నారు. నిత్యం ఏదో ఒక కూలి పనులకు బతుకు జీవనం కోసం అందరితో కలిసి వెళ్లడంతో,ఒక్కసారిగా ప్రమాదం జరగడంతో వారికి గ్రామంలో విషాదఛాయలు చోటుచేసుకున్నాయి.. దగ్గరలో ఉన్న ఓజిలి ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని, గాయాలు పాలైన మిగతా వ్యక్తులను నేషనల్ జాతీయ రహదారికి సంబంధించిన 1033 హైవే అంబులెన్స్ ద్వారా నాయుడుపేటకు ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించి ఇచ్చారు అందిస్తున్నారు..అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**నాయుడుపేట- సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నాయుడుపేట విద్యుత్ శాఖ ఏఈ ఎన్. శివశంకర్ తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయం కారణంగా లోతువానిగుంట, ఎల్ఐ సాగరం, బీడీ కాలనీ, భూపయ్య కాలనీ, అగ్రహారపేట, పిచ్చిరెడ్డితోపు, అమరా గార్డెన్, చంద్రమౌళి నగర్, విజయ గణపతి ఆలయ ప్రాంతం, టీచర్స్ కాలనీ, బాలాజీ గార్డెన్, బాలాజీ గ్రీన్ సిటీ, గాంధీ మందిరం, జైహింద్ కాలనీ, గరిడి వీధి, కోళ్లఫారం, ఆవని హోమ్స్, కాళహస్తి బైపాస్ రోడ్డు, హెచ్పీ పెట్రోల్ బంక్, రాజగోపాలపురం, శ్రీరామ్ నగర్, అశోక్ నగర్, విన్నమాల గేట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. మరమ్మతుల పనుల కారణంగా తాత్కాలికంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నందున వినియోగదారులు, పట్టణ ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

## నారాయణ హైస్కూల్‌లో ఘనంగా తాతయ్యలు-అమ్మమ్మల దినోత్సవం







**దొరవారిసత్రం- సూర్యవాస్తవం:** నాయుడుపేట పట్టణంలోని నారాయణ ఈఎం హైస్కూల్‌లో శనివారం తాతయ్యలు- అమ్మమ్మల దినోత్సవాన్ని ఘనంగా నిర వ్వహించారు. ఈ కార్యక్రమానికి ఏజీఎం నూర్ రియాజ్ ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తాతయ్యలు, అమ్మమ్మల పట్ల ప్రేమాభిమానాలను చాటుతూ పాదాభి వందనాలు చేసిన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. తాతయ్యలు, అమ్మమ్మలు చిన్నారులతో కలిసి ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని ఆనందంగా ఆస్వాదించారు. ఈ సందర్భంగా ఏజీఎం నూర్ రియాజ్ మాట్లాడుతూ,తాతయ్యలు-అమ్మమ్మలు కుటుంబంలో ప్రేమ, అనుభవం, విలువలకు ప్రతీకలని అన్నారు. వారి ఆశీస్సులు, మార్గదర్శకత్వం పిల్లల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహద పడతాయని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.మల్లికార్జున మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పిల్లలకు కుటుంబ విలువలు,పెద్దల పట్ల గౌరవం,అనుబంధం గురించి తెలియజేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ గౌస్ బాషా, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, తాతయ్యలు-అమ్మమ్మలు పాల్గొన్నారు.

## "సంజీవిని" అమలుపై ముఖ్యమంత్రి సమావేశంలో పాల్గొన్న ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్





**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** అమరావతి ఏపీ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరుగుతున్న జిల్లా కలెక్టర్ల 8వ సమావేశం రెండో రోజు కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇతర అంశాలతో పాటు"సంజీవిని"కార్యక్రమం రాష్ట్రవ్యాప్త అమలుపై చర్చించారు.ఇప్పటికే ఐదు జిల్లాల్లో అమలవుతున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని 2,068 వైద్య సంస్థలకు విస్తరించేలా చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్,సిబ్బందికి శిక్షణ, మౌలిక వసతుల బలోపేతం ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, సమన్వయంతో కూడిన నాణ్యమైన వైద్య సేవలు అందేలా సంజీవని అమలును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. అంతేకాకుండా సంజీవిని కార్యక్రమం అతివేగంగా ఐదు జిల్లాలలో అమలు అవుతునందుకు అమలయే విధంగా పూర్తిగా బాధ్యతలు చేపట్టి చర్యలు తీసికొని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు.

## కూటమి పాలనలో పోలీసుల తీరు మారకుంటే న్యాయపోరాటం తప్పదు

- అక్రమ కేసులకు వైసీపీ శ్రేణులు భయపడరు
- తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి
- సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** కూటమి ప్రభుత్వ పాలనలో పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేస్తూ కూటమి ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడుతోందని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. పోలీసుల తీరు మార కుంటే న్యాయ పోరాటం తప్పదని వారు హెచ్చరించారు. శుక్రవారం నాయుడుపేటలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెళ్లకూరు రోడ్డు ప్రాంతంలో జరిగిన చిన్న ఘటనను పెద్దదిగా చూపించి హత్యాయత్నం వంటి తీవ్రమైన సెక్షన్లు నమోదు చేయడం సరికాదని, ఘటనతో సంబంధం లేని వ్యక్తులను సైతం కేసుల్లో ఇరికిస్తున్నారని కిలివేటి సంజీవయ్య ఆరోపించారు.వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిపై అక్రమ కేసు నమోదు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టప్రకారం వ్యవహరించాలని, వైసీపీ నాయకులు,కార్యకర్తలపై అక్రమ కేసులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్, డీజీపీ, ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పాటు అవసరమైతే బాధ్యులపై ప్రైవేటు కేసులు దాఖలు చేసి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, మట్టి, మద్యం, రేషన్ బియ్యం తదితర వ్యవహారాల్లో అక్రమాలు జరుగుతున్నాయని కిలివేటి సంజీవయ్య ఆరోపించారు.ఈ అక్రమాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేసి భయపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి ఆరోపించారు. పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవ హరి స్తోం దని విమర్శించారు. అంబేడ్కర్ రాజ్యాంగా నికి బదులుగా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడు స్తోందని అన్నారు. వైసీపీ నాయ కులు, కార్యకర్తలపై రాజకీయ కక్షతో కేసులు నమోదు చేస్తున్నారని, అక్రమ కేసులతో పార్టీ శ్రేణులను భయపెట్టలేరని గురుమూర్తి స్పష్టం చేశారు.బాధితులకు అండగా నిలిచి,అవసరమైతే ప్రైవేటు కేసులు దాఖలు చేసి న్యాయపోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కాలం మారుతుంది. అన్యాయంగా కేసులు బనాయిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కిలివేటి సంజీవయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, జిల్లా సెక్రటరీలు మద్దాలి సోమశేఖర్ రెడ్డి, వైసీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి,ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి,పెళ్లకూరు ఎంపీపీ శేఖర్ రెడ్డి, పెళ్లకూరు మండల అధ్యక్షులు ఒబ్బు వెంకటరత్నం, వైసిపి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ,చదలవాడ కుమార్,పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు జనసేన కసరత్తు ముమ్మరం

- మున్సిపల్ పోరుకు ముందస్తు కార్యాచరణపై సమీక్ష
- వార్డు స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమన్వయానికి పెద్దపీట
- ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచన





**పెళ్లకూరు- సూర్య వాస్తవం:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ ఎన్నికల సన్నాహకాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా గూడూరు నియోజకవర్గానికి సంబంధించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమన్వయ సమావేశం తిరుపతి లోని ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్‌లో నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ప్రణాళిక, పార్టీ శ్రేణుల సమన్వయం, వార్డు స్థాయి కార్యాచరణ, స్థానిక సమస్యల గుర్తింపు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. తిరుపతి--చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గాల కన్వీనర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ హస్తకళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు, రాష్ట్ర జాయినింగ్ కమిటీ సభ్యులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డా. పసుపులేటి హరిప్రసాద్ సూచనలతో సమావేశాన్ని నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ కోఆర్డినేషన్ టీం సభ్యులు కిరణ్ రాయల్, బి. విజయ్ కుమార్, కీర్తన తదితరుల సూచనలతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సమన్వయ కమిటీ సపోర్ట్ టీం సభ్యులు ఎస్.కె. నయీం, మునిగేరిష్, చంద్రనీల్, ఇంద్రవర్ధన్ తదితరులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

### ముందస్తు ప్రణాళికతో ముందుకు..

రాబోయే మున్సిపల్ ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన అవసరాన్ని సమావేశంలో నేతలు వివరించారు. స్థానిక పరిస్థితులు, రాజకీయ సమీకరణాలు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రాంతాల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో తలెత్తే వివిధ అంశాలపై పార్టీ శ్రేణులకు ముందుగానే అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

### వార్డు స్థాయి నుంచి బలోపేతం

పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా వార్డు స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు శ్రేణుల మధ్య సమన్వయం పెంచుకోవడంపై సమావేశంలో ప్రత్యేకంగా దృష్టి సారించారు. స్థానికంగా పార్టీకి ఉన్న బలాలు, బలహీనతలను గుర్తించి అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలకు అప్పగించే బాధ్యతలను స్పష్టంగా నిర్వచించి, ఎన్నికల ప్రక్రియను క్రమబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

### ప్రజా సమస్యలపై దృష్టి

ఎన్నికల సమయంలో కేవలం రాజకీయ అంశాలకే పరిమితం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలని నాయకులు సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి తదితర అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, వాటిని సంబంధిత వేదికలపై ప్రస్తావించాలని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా పార్టీకి ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయని నేతలు అభిప్రాయపడ్డారు. స్థానిక సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న మార్గాలను అన్వేషిస్తూ ప్రజల తరఫున బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

### శ్రేణుల మధ్య సమన్వయమే కీలకం

ఎన్నికల సమయంలో నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్త వరకు సమన్వయంతో పనిచేయడం కీలకమని సమావేశంలో పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల విధులు, బాధ్యతలపై ప్రతి ఒక్కరికీ స్పష్టత ఉండేలా ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పార్టీ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.

### క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ

పట్టణాలు, వార్డుల వారీగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం, స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించడం, వాటికి ప్రాధాన్య క్రమం నిర్ణయించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నేతలు సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారి అవసరాలు, ఆకాంక్షలను పార్టీ కార్యాచరణలో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా క్రమశిక్షణతో వ్యవహరిస్తూ, సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

### గూడూరు నియోజకవర్గ నేతల హాజరు

ఈ సమావేశంలో గూడూరు నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు, కోట, వాకాడు, చిత్తమూరు, చిల్లకూరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చిత్తమూరు మండల ఇన్‌చార్జి నారాయణ, వాకాడు మండల ఇన్‌చార్జి చంద్ర , మున్నా, కోట మండల ఇన్‌చార్జి అల్లం బాబు, శ్రీకాంత్, హరీష్, గూడూరు కృష్ణ, చిల్లకూరు మండలానికి చెందిన ఎస్కే జమ్మల్ భాయ్, వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు.

# 'ది ప్యారడైజ్'కు ట్రైలర్ ఉండదు..

# ఎందుకో చెప్పిన హీరో నాని



## రూ.100 కోట్ల ఓపెనింగ్..

## రూ.300 కోట్ల నష్టం! యశ్ 'టాక్సిక్'కు ఏమైంది?

యశ్ సినిమా అంటేనే భారీ అంచనాలు. 'కేజీఎఫ్-2' తర్వాత ఆయన నటించిన 'టాక్సిక్'పై కూడా అదే స్థాయిలో హైప్ వచ్చింది. కానీ సినిమా బాక్సాఫీస్ దగ్గర మాత్రం ఆ అంచనాలను అందుకోలేకపోయింది. భారీ ఓపెనింగ్ వచ్చినా.. ఆ తర్వాత కలెక్షన్లు ఒక్కసారిగా పడిపోయాయి. దీంతో ఈ చిత్రం భారీ నష్టాల్లోకి వెళ్లినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.'టాక్సిక్' తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.140 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు సమాచారం. భారత్‌లో నెట్ వసూళ్లు సుమారు రూ.101 కోట్లుగా నమోదయ్యాయి. దీంతో సినిమా బ్లాక్‌బస్టర్ దిశగా దూసుకెళ్తుందని భావించారు.అయితే రెండో రోజు నుంచే పరిస్థితి మారిపోయింది. భారత్‌లో రెండో రోజు వసూళ్లు దాదాపు రూ.37 కోట్లకు పడిపోయాయి. తొలి సోమవారానికి రూ.10 కోట్ల కంటే దిగువకు చేరాయి. 15 రోజులకు ప్రపంచవ్యాప్తంగా రూ.339 కోట్లకు పైగా వసూలైనట్లు లెక్కలు చెబుతున్నాయి. 16వ రోజు భారత్‌లో కేవలం రూ.40 లక్షల మేరే వసూళ్లు వచ్చినట్లు సమాచారం.ఈ సినిమాకు నిర్మాణ వ్యయం దాదాపు రూ.450 కోట్లు ఉంటుందని అంచనాలు ఉన్నాయి. ప్రచారం, విడుదల ఖర్చులు, వడ్డీలు కలిపితే మొత్తం పెట్టుబడి రూ.500 కోట్లకు చేరినట్లు కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో థియేట్రికల్ వసూళ్లు సరిపోక భారీ నష్టం తప్పలేదని ట్రేడ్ విశ్లేషకుడు రమేశ్ బాలా అభిప్రాయపడ్డారు.'టాక్సిక్' నష్టం రూ.300 కోట్ల నుంచి రూ.350 కోట్ల వరకు ఉండొచ్చని ఆయన తెలిపారు. 'గేమ్ ఛేంజర్', 'ఆదిపురుష్' వంటి భారీ చిత్రాల సరసన ఇప్పుడు 'టాక్సిక్' కూడా చేరినట్లయింది.ఓటీటీ హక్కులను ముందుగానే విక్రయించకపోవడం కూడా సినిమాకు ప్రతికూలంగా మారిందని బాలా చెప్పారు. భారీ వసూళ్లు వస్తాయని ఎదురుచూసిన నిర్మాతలకు.. సినిమా ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో ఓటీటీ విలువ కూడా గణనీయంగా పడిపోయినట్లు తెలుస్తోంది.

'ది ప్యారడైజ్' సినిమాకు ట్రైలర్ విడుదల చేయడం లేదని హీరో నాని స్పష్టం చేశారు. సెప్టెంబరు 24న సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో చిత్రబృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. సినిమా నాణ్యత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని నాని చెప్పారు.ట్రైలర్ కోసం నాలుగైదు రోజులు కేటాయిస్తే సినిమా పనులపై ప్రభావం పడుతుందని వివరించారు. విడుదలకు సమయం తక్కువగా ఉన్నందున ప్రస్తుతం తమకు సినిమా పూర్తి చేయడమే ముఖ్యమని పేర్కొన్నారు.

**శ్రీకాంత్ ఓదెలపై ప్రశంసలు**

'దసరా', 'ది ప్యారడైజ్' పాటలు ప్రేక్షకులకు నచ్చడానికి సంగీత దర్శకులతో పాటు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పాత్ర కీలకమని నాని అన్నారు. తనకు కావాల్సిన పాట ఎలా ఉండాలి? ఎవరితో పాడించాలి? ఎలాంటి సాహిత్యం కావాలో? శ్రీకాంత్‌కు స్పష్టమైన అవగాహన ఉందని చెప్పారు.సినిమా కోసం తాను జడలు, చేతిపై టాటూతో కనిపించడంపైనా ఎలాంటి అభ్యంతరం చెప్పలేదని నాని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సోషల్ మీడియా ధోరణులకు భయపడకుండా తన ఆలోచనను తెరపై చూపించే వ్యక్తి శ్రీకాంత్ అని కొనియాడారు. అతడి పట్టుదల, సినిమా పట్ల ఉన్న ప్రేమ తనకు ఎంతో గర్వంగా అనిపిస్తాయని పేర్కొన్నారు.



**అత్యంత కష్టమైన సినిమా**




'ది ప్యారడైజ్' కోసం తన సినీ ప్రయాణంలోనే ఎక్కువగా కష్టపడ్డానని నాని తెలిపారు. టీజర్‌లోని కొన్ని డైలాగ్స్ అర్థం కావడం లేదని వచ్చిన విమర్శలపై కూడా ఆయన స్పందించారు. కథలోని పాత్ర స్వభావం దెబ్బతినకుండా కొన్ని విషయాలను పూర్తిగా వెల్లడించలేమని చెప్పారు.ఇది పాన్ ఇండియా సినిమా కాదని, తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపారు. తల్లీ కొడుకుల బంధం చుట్టూ కథ సాగుతుందని, హింసతో పాటు బలమైన భావోద్వేగాలు కూడా ఉంటాయని చెప్పారు.

**రన్‌టైమ్.. ప్రీమియర్లపై క్లారిటీ**

'ది ప్యారడైజ్' రన్‌టైమ్ 2 గంటల 49 నిమిషాలు ఉంటుందని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల వెల్లడించారు. 'ఏష నాగుల' పాట కోసం ఎవరిని తీసుకోవాలా అని ఆలోచిస్తున్న సమయంలో కీర్తి సురేశ్‌ను సంప్రదించగా ఆమె అంగీకరించారని తెలిపారు. సినిమా షూటింగ్‌లో తనతో పాటు పలువురికి గాయాలయ్యాయని నాని చెప్పారు. అయితే అవి సాధారణమేనని పేర్కొన్నారు. మోహన్‌బాబుతో కలిసి పనిచేయడం మంచి అనుభవమని, ఆయనను దగ్గరగా చూస్తే అభిప్రాయం పూర్తిగా మారుతుందని నాని అన్నారు. సినిమా ప్రీమియర్లు ఉంటాయని నిర్మాత సుధాకర్ చెరుకూరి తెలిపారు. టికెట్ ధరల పెంపుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు.



# కౌంటీ క్రికెట్‌లో కుల్దీప్ యాదవ్ మాయ..

## ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లతో గంభీర్‌కు గట్టి సందేశం

టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, ఇంగ్లండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. యార్క్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ చైనామన్ బౌలర్, ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ రాణించి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. నిలకడగా అవకాశాలు దక్కని ప్రస్తుత తరుణంలో ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు గట్టి సందేశం పంపినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు.



**ఒకే మ్యాచ్‌లో 10 వికెట్ల ప్రదర్శన**

ఎసెక్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో యార్క్‌షైర్ తరఫున బరిలోకి దిగిన కుల్దీప్ యాదవ్ ఆద్యంతం ఆధిపత్యం చెలాయించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో మరింత చెలరేగి 50 పరుగులకే 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో మ్యాచ్ మొత్తంలో 120 పరుగులకు 10 వికెట్లు సాధించిన ఘనతను అందుకున్నాడు. అంతకుముందు బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టు స్కోరు 390కి చేరడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఎసెక్స్ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ అయింది.

**ఇంగ్లండ్, భారత పిచ్‌ల మధ్య తేడా ఇదే..**

మ్యాచ్ అనంతరం కుల్దీప్ మాట్లాడుతూ ఇంగ్లండ్ పిచ్‌ల స్వభావాన్ని వివరించాడు. "ఇక్కడి వికెట్లపై బౌలింగ్ చేయడం చాలా బాగుంది. పిచ్‌లోనే మంచి పేస్ ఉండటంతో మనం వేగంగా బంతులు వేయాల్సిన అవసరం లేదు. బంతి పిచ్ అయ్యాక వేగం పుంజుకుంటుంది. మనం చేయాల్సిందల్లా బంతిని బాగా స్పిన్ చేయడమే. భారత పిచ్‌లతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నం. మన దగ్గర వికెట్లు నెమ్మదిగా ఉంటాయి, స్పిన్ ఎక్కువ తిరుగుతుంది. కానీ బ్యాటర్లు సర్దుకోవడానికి సమయం దొరుకుతుంది. ఇక్కడ పిచ్ వేగం కారణంగా బ్యాటర్లు బ్యాక్‌ఫుట్‌పై ఆడితే దొరికిపోతారు. ఫ్రంట్‌ఫుట్‌పై ఆడాల్సి వస్తుంది. అప్పుడే కీపర్ క్యాచ్, స్లిప్ క్యాచ్ లేదా షార్ట్ లెగ్ క్యాచ్ రూపంలో వికెట్లు తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది" అని కుల్దీప్ విశ్లేషించాడు.

**గంభీర్‌కు సందేశమా?**

లెఫ్ట్ ఆర్మ్ రిస్ట్ స్పిన్నర్లు (చైనామన్) ప్రపంచ క్రికెట్‌లో చాలా అరుదు. అలాంటి అరుదైన నైపుణ్యం ఉన్నప్పటికీ, 2017లో అరంగేట్రం చేసినప్పటి నుంచి కుల్దీప్ కేవలం 19 టెస్టుల్లో మాత్రమే ఆడాడు. కెరీర్ ఆరంభంలో అశ్విన్, జడేజా ద్వయం కారణంగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పుడు హెడ్ కోచ్‌గా వచ్చిన గౌతమ్ గంభీర్, కాస్త బ్యాటింగ్ చేయగల బౌలర్లకే ప్రాధాన్యత ఇస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ వంటి ఆటగాళ్లకు అవకాశాలు లభిస్తుండగా, కుల్దీప్ జట్టులోకి వస్తూ పోతూ ఉన్నాడు. నిలకడగా అవకాశాలు లేక తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో కౌంటీల్లో 10 వికెట్ల ప్రదర్శనతో తన ప్రధాన బలం బౌలింగే అని, అవకాశాలిస్తే ఎలాంటి పిచ్‌పైనైనా వికెట్లు తీయగలనని కుల్దీప్ యాదవ్ సెలక్టర్లకు, యాజమాన్యానికి స్పష్టమైన సంకేతాలు పంపాడు.



# శాంసన్ వర్సెస్ వైభవ్..

## ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా ఎవరుండాలంటే? రహానే క్లారిటీ

టీ20ల్లో భారత్ ఓపెనర్ల విషయంలో తరచూ మార్పులు చేస్తోంది. శుభ్‌మన్ గిల్, సంజూ శాంసన్ మధ్య పోటీ నెలకొంది. అభిషేక్ శర్మ ఇప్పటికే తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. తర్వాత ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్‌గా తన వాదన వినిపించాడు. అయితే అతడిని మూడో స్థానానికి పంపించారు. తాజాగా వైభవ్ సూర్యవంశీకి అవకాశం రావడంతో శాంసన్ మరోసారి జట్టులో చోటు కోల్పోయాడు.ఇంగ్లాండ్‌తో అరంగేట్ర సిరీస్‌లో వైభవ్ 14, 13, 15 పరుగులు చేశాడు. తర్వాత జింబాబ్వేతో సిరీస్‌లో మాత్రం అదరగొట్టాడు. మూడు మ్యాచ్‌ల్లో 151 పరుగులు చేశాడు. చివరి మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్ ఉత్తమ ఆటగాడి అవార్డును కూడా అందుకున్నాడు.ఇలాంటి సమయంలో భారత మాజీ బ్యాటర్ అజింక్య రహానే కీలక వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ కంటే సంజు శాంసన్‌కే మరో అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడ్డాడు. వైభవ్‌కు భవిష్యత్తులో చాలా అవకాశాలు వస్తాయని చెప్పాడు.ప్రపంచకప్‌లో రాణించిన టాప్-3 బ్యాటర్లతోనే భారత్ ముందుకెళ్లాలని రహానే సూచించాడు. శాంసన్, అభిషేక్, ఇషాన్ కిషన్ టాప్-3లో ఉండాలని అన్నాడు. రెండు మూడు మ్యాచుల్లో విఫలమైనంత మాత్రాన శాంసన్‌ను పక్కన పెట్టడం సరికాదని చెప్పాడు.ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు శాంసన్‌ను తిరిగి జట్టులోకి తీసుకోవడంపై రహానే సంతోషం వ్యక్తం చేశాడు. ప్రపంచకప్‌లో శాంసన్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన విషయాన్ని గుర్తు చేశాడు. శాంసన్ మ్యాచ్ విన్నర్ అని పేర్కొన్నాడు. అతడి రాకతో జట్టు మరింత బలపడుతుందని చెప్పాడు.

# కడప డి లిమిటేషన్‌లో భారీగా ముస్లిం ఓట్ల గల్లంతు

## - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ఫిర్యాదు



**కడప - సూర్య వాస్తవం:** కడప నగరపాలక సంస్థ ఎన్నికలలో భాగంగా ఇటీవల నిర్వహించిన డీలిమిటేషన్ (డివిజన్ల పునర్విభజన ప్రక్రియ) లో చాలా డివిజన్లలో భారీగా ముస్లిం ఓట్లు గల్లంతయినట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ మయాన రహమతుల్లా ఖాన్ శుక్రవారం కడప నగరపాలక సంస్థ కమిషనర్ భవాని ప్రసాద్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక 45వ డివిజన్లోని డోర్ నెంబరు 7/785 నుంచి డోర్ నెంబరు 7/1098 వరకు గృహ సముదాయాలలో నీ ముస్లిం ఓట్లను పూర్తిగా తొలగించారని ఆరోపించారు. ఈ విధంగా సదరు డివిజన్ లోని సుమారు రెండు వేల మంది ఓటర్లు వివరాలు లేవన్నారు. ఈ ఓటర్లను మరే ఇతర డివిజన్లో కలిపినట్లు తమకు సమాచారం లేదన్నారు. అలాగే 52వ డివిజన్లోని సుమారు 80 గృహాలకు సంబంధించిన వివరాలను తొలగించారన్నారు. ఈ డివిజన్లో సుమారు 500 మంది ఓట్లు ఇతర డివిజన్లో చూపలేదన్నారు. కాబట్టి మొత్తంగా ఈ రెండు డివిజన్లలో అ 2,500 ఓట్ల లో అధికంగా ముస్లిం ఓట్లను తొలగించి, మరే ఇతర డివిజన్లో మార్పులు చేసినట్లు ఎక్కడ ప్రస్తావించలేదన్నారు. ఈ విధంగా డి లిమిటేషన్ ప్రక్రియ పక్కదారి పట్టినట్లు ఆరోపించారు. అంతే కాకుండా ఇతర డివిజన్లలో కూడా భారీగా ముస్లిం ఓట్ల తొలగింపు లక్ష్యంగా డీలిమిటేషన్ చేసినట్లు స్పష్టం అవుతుందన్నారు. దీనిపై ప్రేమ కార్పొరేషన్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన విచారణ చేసి బాధ్యత ఓటర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 45వ డివిజన్లో తొలగించిన ఓట్లను యధావిధిగా అక్కడే ఉంచాలని కోరారు. డీలిమిటేషన్ ప్రక్రియలో పూర్తిగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. మెజార్టీ డివిజన్లలో కేవలం ముస్లిం ఓటర్ల తొలగింపు లక్ష్యంగా డి లిమిటేషన్ చేసినట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నేతలు రఫీ ఖాన్, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# కరకంబాడి అమర రాజా విద్యాలయంలో ఘనంగా 'కథోత్సవ్--2026'

## -సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ఇతివృత్తంతో అంతర పాఠశాలల ఇంగ్లీష్ కథల పోటీలు




తిరుపతి, సెప్టెంబర్ 11 సూర్య వాస్తవం: కరకంబాడిలోని అమర రాజా ఆడిటోరియంలో అమర రాజా విద్యాలయం ఆధ్వర్యంలో అంతర పాఠశాలల ఇంగ్లీష్ కథల పోటీ 'కథోత్సవ్--2026' అత్యంత వైభవంగా నిర్వహించారు. 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు' ప్రధాన ఇతివృత్తంగా నిర్వహించిన ఈ పోటీలలో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 17 ప్రముఖ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కథా చెప్పే నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ లాంగ్వేజ్, లిటరేచర్ ప్రొఫెసర్ డాక్టర్ పి. హరి పద్మ రాణి, అమర రాజా గ్రూప్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ ప్రశాంత్ తివారి, అమర రాజా ఎనర్జీ, మొబిలిటీ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా, గౌరవ న్యాయ నిర్ణేతలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, కథలు చెప్పడం ఒక అద్భుతమైన కళ అని, ఇది విద్యార్థుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి, ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రస్తుత ప్రపంచానికి ఎంతో కీలకమైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను విద్యార్థులు కథల రూపంలో ఎంచుకుని, వాటిని సృజనాత్మకంగా ప్రదర్శించిన తీరు అభినందనీయమని ప్రశంసించారు. తీవ్ర పోటీ నడుమ సాగిన ఈ ఇంగ్లీష్ కథల పోటీలలో దిగువమాఘం అమర రాజా విద్యాలయం విద్యార్థిని బి. వైష్ణవి ప్రథమ బహుమతి సాధించగా, కరకంబాడి అమర రాజా విద్యాలయం విద్యార్థిని సి. దేవసు వర్షిణి ద్వితీయ బహు మతి, శ్రీసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని సి. ఝాన్సీ తృతీయ బహుమతిని గెలుచు కున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అమర రాజా విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీమతి గ్లోరి దేవ ప్రియ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి పూజ, ఉపాధ్యాయ బృందం, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని 'కథోత్సవ్--2026' కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థుల భద్రత, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## - రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

బ్రహ్మంగారిమఠం, సూర్య వాస్తవం సెప్టెంబర్ 11: విద్యార్థుల భద్రత, ఆరోగ్య సంరక్షణపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత సూచించారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠంలో శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారిని ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మఠం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారిని దర్శించి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర కాలజ్ఞాన విశేషాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం స్వామి వారు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కాలజ్ఞానం పుస్తకాన్ని వారికి అందజేశారు విద్యార్థుల భద్రత, ఆరోగ్య సంరక్షణ, బాలల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవసరమైన సందర్భాల్లో పిల్లలను దత్తత తీసుకుని వారికి సరైన మార్గదర్శనం అందించాలని సూచించారు. బాలలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించేలా అవగాహన కల్పించాలని



తెలిపారు. అదేవిధంగా టీనేజ్ ప్రెగ్నెన్సీల నివారణపై అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని, బాలికల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అవసరమైన సహాయం, కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. అనం తరం మైదుకూరు కేజీబీవీ హైస్కూల్ను, ప్రొద్దుటూరులో నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తల సమావేశాన్ని ఆమె పరిశీలించి, బాలల సంక్షేమం, భద్రతకు సంబంధించిన అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ, సాధికారత అధికారి పి. రమాదేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి. సుభాష్ యాదవ్, సమగ్ర శిక్ష డి ఐఈ కోఆర్డినేటర్ కె. వెంకటసుబ్బయ్య, ఎస్సై శివ ప్రసాద్ సీడీపీఓ సయ్యద్ ముంతాజ్ బేగం, చాపాడు సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చేతిరాతల ప్రతిభ విద్యార్థులకు బహుమతులు ప్రధానం



బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :బ్రహ్మంగారిమఠం మండలంలోని బ్రైట్ మైండ్స్ స్కూల్ 7వ తరగతి విద్యార్థిని అంబిశెట్టి నాగ చార్విత చక్కని చేతిరాతలో ప్రతిభ కనబరిచి ఆ తరగతిలో మొదటి స్థానం నిలిచి అవార్డ్ ఆఫ్ మెరిట్ సర్టిఫికెట్‌ను అందుకుంది ఎం.ఎం.రెడ్డి అక్షర హ్యాండ్‌రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి నిర్వహించిన గుడ్ హ్యాండ్‌రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు నాగ చార్విత కు ఈ ప్రశంసాపత్రం అందజేశారు.ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎం.ఎం.రెడ్డి అక్షర హ్యాండ్‌రైటింగ్ అకాడమీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో చక్కని చేతిరాత అక్షర స్పష్టత రాత వేగం పరిశుభ్రత వంటి నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ అందించారు నాగ చార్విత మరియు స్కూల్ ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను బ్రైట్ మైండ్ పాఠశాల కరెస్పాండెంట్ శిల్ప ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో విద్యతో పాటు ఇతర సృజనాత్మక రంగాల్లోనూ మరింత రాణించాలని ఆకాంక్షించారు.చేతిరాతలో ప్రతిభను గుర్తించి సర్టిఫికెట్ అందుకోవడం పట్ల విద్యార్థిని చార్విత సంతోషం వ్యక్తం చేసింది.

# వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

## నిబంధనలు పాటించాలి.. పోలీసులకు సహకరించాలి:సీఐ చాంద్‌బాషా





**సూర్య వాస్తవం-చెన్నూరు:** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని చెన్నూరు సీఐ ఎస్.కె. చాంద్‌బాషా సూచించారు. శుక్రవారం చెన్నూరు ఎంపీడీఓ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహిం చాలన్నారు. మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రభుత్వం సూచించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నిమజ్జనం సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు, రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.అన్ని వర్గాల సమన్వయంతో వినాయక చవితి వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

**పగిడ్యాల- సూర్య వాస్తవం:** నంద్యాల జిల్లా పగిడ్యాల ఆదర్శ పాఠశాల పగిడ్యాలలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కోలాల వెంకటరమణయ్య విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. రోజుకు రెండు సార్లు పళ్లుతోముకోవాలని చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం గోళ్లను క్రమం తప్పకుండా శుభ్రంగా ఉంచుకోవడం, రోజుకు రెండు సార్లు స్నానం చేసి పరిశుభ్రమైన దుస్తులు ధరించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ సలీం భాష ఆధ్వర్యంలో నిర్వహించగా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140

## కేంద్ర మంత్రికి స్వాగతం పలికిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** రాష్ట్ర పర్యటన నిమిత్తం విజయవాడ విమానాశ్రయానికి విచ్చేసిన గౌరవ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జేపీ నడ్డాకి రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ సాదర స్వాగతం పలికారు. అనంతరం కేంద్రమంత్రి జెపి నడ్డాకి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. కేంద్రమంత్రి శనివారం విజయవాడలో జరుగు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొనడం జరుగుతుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ అన్నారు.

## వినాయకుని భారీ సెట్టింగ్ ఏర్పాట్ల పరిశీలన

**-నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్**

**-వినాయక ఉత్సవ కమిటీ ఎస్.జె జ్యువెలరీ అధినేత,పోట్లపూడి రాజేష్.**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని దర్గా సెంటర్ వద్ద ఈనెల సెప్టెంబర్ 14వ తేదీన వినాయక చవితి సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎస్.జె జ్యువెలరీ అధినేత,పొట్లపూడి రాజేష్ ఆధ్వర్యంలో 23 అడుగుల వినాయ కుడితో, గత 20 రోజుల నుండి హైదరాబాదు కళాకారులచే 30 అడుగుల భారీ సెట్టింగ్ లతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జనసేన పార్టీ సూళ్లూరుపేట ఇంచార్జ్, తిరుపతి జిల్లా నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ దర్గా సెంటర్లో తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా ఏర్పాటు చేస్తున్న 23 అడుగుల వినాయకుడు,30 అడుగుల భారీ సెట్టింగ్లను పరిశీలించారు..

## 20న ఉచిత కంటి వైద్య శిబిరం



**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని శ్రీవాసవి కళ్యాణమండపం(అమ్మవారి శాల )లో 20వ తేదీ ఆదివారమున పామిడి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రఖ్యాతి చెందిన బెంగుళూరు శంకరకంటి ఆసుపత్రి నేతృత్వంలో ఉచిత కంటిమెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్ల పాటి తిరుపతి నాయుడు, లైన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు పట్రా శ్రీనివాసులు, లైన్స్ క్లబ్ సభ్యులు పత్రికా ప్రకటనలో తెలిపారు.బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి యొక్క కంటి వైద్యనిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైతే అన్ని రకాల కంటి ఆపరేషన్లకు ఉచితముగా ఆపరేషన్లు చేస్తారని, శంకర కంటి ఆసుపత్రి వారు ప్రత్యేక బస్సుల్లో బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు అనంతరం తిరిగి గమ్యస్థానమైన పాముడికి చేరుస్తారని వారు తెలియజేశారు .కంటి వైద్య శిబిరంలో పాల్గొనే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్సులు,రెండు పాస్ ఫోటోలు తీసుకొని రావాలని తెలియజేశారు .ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని పామిడి మండల ప్రజలే గాక చుట్టూ ప్రక్కల మండలాల కంటి జబ్బులు గల ప్రజలు పాల్గొని పరీక్షించుకోవచ్చుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు విజ్ఞప్తి చేశారు.

## జైన్ పాఠశాలలో ఘనంగా హిందీ విలాస్

**కదిరి - సూర్య వాస్తవం :** పట్టణ పరిధిలోని బేరిపల్లి జైన్ పాఠశాల లో శుక్రవారం హిందీ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, పాఠశాల కరస్పాండెంట్ సాగర్ మరియు సీనియర్ మేనేజర్ సరస్వతి పర్యవేక్షణలో హైస్కూల్ కోఆర్డినేటర్ కరే బాలాజి, ప్రైమరీ కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో హిందీ విద్వాన్ సుమియా కార్యక్రమాన్ని ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో హాజరై భారతీయ మాతృభాష అయిన హిందీ భాష లో వ్యాఖ్యానించారు, అనంతరం విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి, అనంతరం హైస్కూల్ కోఆర్డినేటర్ కరే బాలాజీ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు సాంప్రదాయ విద్యతో పాటు విషయంతో కూడిన విద్యలో తర్ఫీ దును ఇస్తున్నామని పేర్కొన్నారు, భారతీయ సంస్కృతి, ఆచారాల, పద్ధతులను గురించి, వాటి విశిష్టతను పిల్లలకు వివరించారు, అనంతరం ఉత్తమ ప్రదర్శన కనపరిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో జైన్ పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, సిబ్బంది యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఆర్ దళిత కాలనీలో వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

**- అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎంపీ గురుమూర్తికి దళితులు వినతిపత్రం**
**- రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తాం**
**- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**

**దొరవారిసత్రం - సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణ మున్సిపాలిటీ పరిధిలో ఎన్.ఎస్.ఆర్ కాలనీ రైల్వే ట్రాక్ అవతల దళితులు, ఎస్టీ,500 కుటుంబాలు ఉన్నాయి..రైల్వే అధికారులు కొత్త రూల్స్ తీసుకురావడంతో అక్కడ ఉన్న 78 నెంబర్ గల గేటును మూసి వేయడంతో దళితులు ఎన్నో నెలల నుండి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళితే అక్కడ ఉన్న 78 నెంబర్ గల గేటును మూసివేయడంతో దళితుల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవడంతో మూసివేసిన గేటును తెరిపించాలని,జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో, రైల్వే,అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగడం జరిగింది..ఆ దళిత కుటుంబాల్లో చిన్నపిల్లలు స్కూలుకు వెళ్లాలన్న, మరణించిన వారిని స్మశాన వాటికకు తీసుకొని వెళ్లాలన్న,కూలినారి పనులకు వెళ్లేందుకు ఇబ్బందులుగా మారడంతో(ఎస్సీ మాదిగ) దళిత కాలనీవాసులు వైయస్సార్సీపి తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్యలో గురుమూర్తితో వారి సమస్యను చెప్పుకున్నారు..**"ఉన్నతాధికారులతో మాట్లాడి అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తాం"**
**"తిరుపతి పార్లమెంటు మెంబర్ మద్దెల గురుమూర్తి"**



ఈ సందర్భంగా ఎస్సీ దళితుల సమస్యలు విన్న ఎంపీ గురుమూర్తి,మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఎన్.ఎస్.ఆర్ కాలనీ రైల్వే ట్రాక్ అవతలకు నాయకులతో చేరుకున్నారు. అనంతరం అక్కడ (అండర్ బ్రిడ్జి పాస్)ఏర్పాటు కోసం అక్కడ ఉన్న స్థలాన్ని క్షుణంగా పరిశీలించారు..అక్కడ ఉన్న దళిత,ఎస్టి గిరిజన మహిళలతో మాట్లాడటంతో రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి లేనందున అవస్థలు పడుతున్నామని సత్వరమే రైల్వే అధికారులతో మాట్లాడి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎంపీ గురుమూర్తిని కోరగా...! వారి సమస్యలు తెలుసుకున్నారు..అనంతరం ఎంపీ గురుమూర్తి నాయుడుపేట రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లి పరిశీలించడం జరిగింది..ఈ కార్యక్రమంలో ఎస్.ఎం. ఆర్.పి ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మాసారం గోపాల్ మాదిగ,కప్పల మునస్వామి, నక్కినబోయిన శ్రీనివాసులు(జెమిని) గోవిందు మోహన్, జడ వెంకటేష్, తడుకు చందు,ధార శేఖర్,కంటేపల్లి నారాయణ, గోవిందు శ్రీనివాసులు,కప్పల మునిరాజా,కంట్లం చిన్న బాబు, ఆరం వెంకయ్య, చెంచు గోపాల్, తులసి, అశోక్, హర్ష, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.



## సూళ్లూరుపేటలో నో పార్కింగ్ బైకులపై పోలీసుల కొరడా

**- 20 ద్విచక్ర వాహనాలకు జరిమానా..**
**- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు**
**- సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ అజయ్ కుమార్**

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నో పార్కింగ్ ప్రాంతాల్లో ఇష్టారీతిగా బైకులు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వాహనదారులపై పోలీసులు చర్యలు చేపట్టారు.ప్రధానంగా కోమల హోటల్, ఆహా టిఫిన్ సెంటర్ ముందు రోడ్డుపై బైకులు అడ్డంగా పార్కింగ్ చేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతు న్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ,ఎస్ఐ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.నో పార్కింగ్ ప్రాంతంలో నిలిపి ఉంచిన సుమారు 15 నుంచి 20 ద్విచక్ర వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. ఒక్కో వాహనానికి సుమారు రూ.1,000 వరకు జరిమానా విధించినట్లు సమాచారం. హోటళ్లకు వచ్చే కొందరు వాహనదారులు రోడ్డుపైనే బైకులు నిలిపివేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు




తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు, ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందని పేర్కొన్నారు.ఇకపై నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపే వారిపై నిరంతరం తనిఖీలు నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ,తమ వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలని సూచించారు.అదేవిధంగా హోటల్,టిఫిన్ సెంటర్ యజమానులు తమ వద్దకు వచ్చే కస్టమర్లకు పార్కింగ్‌పై అవగాహన కల్పించాలని, రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు చేపట్టిన ఆకస్మిక తనిఖీలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జాతీయ స్థాయిలో వినియోగదారుల సంఘాల బలోపేతమే లక్ష్యం: జి సురేషకుమార్ ...!

**- పుట్టపర్తిలో 16వ జాతీయ వినియోగదారుల సదస్సు -18 రాష్ట్రాల నుంచి ప్రతినిధుల హాజరు**
**ఆన్‌లైన్ మోసాలు, కల్తీ ఉత్పత్తులు, నాసిరకం సేవలపై అవగాహనకు ప్రాధాన్యం**




**అనంతపురం - సూర్య వాస్తవం :** దేశవ్యాప్తంగా వినియోగదారుల సంఘాలను మరింత బలోపేతం చేయడం, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించడమే లక్ష్యంగా 16వ జాతీయ వినియోగదారుల సదస్సును నిర్వహిస్తున్నట్లు కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్, న్యూఢిల్లీ చైర్మన్ అభిషేక్ శ్రీవాస్తవ్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ చైర్మన్ జి. సురేష్ కుమార్ తెలిపారు.శుక్రవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో జాతీయ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు వివిధ రాష్ట్రాల వినియోగదారుల సంఘాల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ప్రస్తుత సమస్యలు, చట్టపరమైన అంశాలు, పరిష్కార మార్గాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించ నున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వినియోగదారులు ఆన్‌లైన్ మోసాలు, నకిలీ, కల్తీ ఉత్పత్తులు, తప్పుదారి పట్టించే ప్రకటనలు, అధిక ధరలు, నాసిరకం వస్తువులు, సేవల్లో లోపాలు, డిజిటల్ లావాదేవీల మోసాలు వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు బాధితులకు చట్టపరమైన పరిష్కారం అందేలా వినియోగదారుల సంఘాలు చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.

### ప్రభుత్వ సహకారం అభినందనీయం

సదస్సు నిర్వహణకు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆ శాఖ కమిషనర్ కె. కన్నబాబు అందిస్తున్న సహకారం అభినందనీయమని వారు తెలిపారు.

### 18 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు

సదస్సుకు దేశంలోని సుమారు 18 రాష్ట్రాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకు చెందిన విని యోగదారుల సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నట్లు తెలిపారు. వినియోగదారుల పరిరక్షణ చట్టం అమలు, ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు, భారతీయ ప్రమాణాల సంస్థ ప్రమాణాలు, డిజిటల్ వినియోగదారుల హక్కులు, ఫిర్యాదుల పరిష్కారం, వినియోగదారుల సంఘాల బలోపేతం తదితర అంశాలపై చర్చలు జరగనున్నట్లు వెల్లడించారు.

### ప్రముఖుల హాజరు

సదస్సుకు పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ కమిషనర్ కె. కన్నబాబు, భారతీయ ప్రమాణాల సంస్థ డైరెక్టర్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రభుత్వం, వినియోగదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు, ప్రజలు సమన్వయంతో పనిచేసినప్పుడే బలమైన వినియోగదారుల ఉద్యమం సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో వినియోగదారుల సంఘాల మధ్య సమన్వయం పెంచడంతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేయడమే సదస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

# ఘనంగా జాతీయ హిందీ దినోత్సవం



**గాండ్లపెంట - సూర్య వాస్తవం :** స్థానిక పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అధ్యక్షతన జాతీయ హిందీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14వ తేదీన జాతీయ హిందీ దినోత్సవం జరుపుకుంటారు ఈ సంవత్సరం వినాయక చవితి పండుగ ఉండడం వలన ముందస్తుగా హిందీ దినోత్సవం జరుపుకున్నారు.. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు చిన్నప్పయ్య మరియు చెన్నూరు తాహెర్ వలి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర సంగ్రామ సమయంలో లో హిందీ భాష ముఖ్యమైన పాత్రను పోషించిందని ఆ కాలంలో కేంద్ర స్థాయిలో తీసుకునే నిర్ణయాలు దేశం నలుమూలల చేరాలంటే ఒక భాష అవసరం ఉందని ఆ పనిని భారతదేశంలోని ఎక్కువ రాష్ట్రాలలో మాట్లాడే హిందీ చేయగలరని భావించి అప్పటినుండి మహాత్మా గాంధీజీ భారత దేశ స్వాతంత్ర సంఘంతో పాటు హిందీ యొక్క ప్రచారాన్ని కూడా నిర్వహించారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత 1949, సెప్టెంబర్ 14 న రాజ్యాంగ ఆర్టికల్ 343(1) ప్రకారం హిందీని రాజ భాషగా మరియు దేశ భాషగా గుర్తింపు కల్పించారు. ఆ రోజు నుండి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న దేశవ్యాప్తంగా హిందీ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈరోజు హిందీ భాష దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా ప్రాముఖ్యతను సంతరించుకున్నది కావున జనవరి 10వ తేదీన అంతర్జాతీయ హిందీ దినోత్సవం గా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. హిందీ నేర్చుకుంటే భారతదేశంలోని ఏ మూలకైనా వెళ్లి వ్యాపారాలు చేసుకోవచ్చని, ముఖ్యంగా కేంద్ర స్థాయిలో రాజకీయ నాయకులు కూడా హిందీ భాష లో మాట్లాడినట్లయితే మన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం స్పష్టమైన సమస్యలను తెలియజేసి, ఎక్కువ నిధులు సాధించ గలరని అనేక సందర్భాల్లో వారే తెలియజేయడం జరిగినది, ఐఏఎస్, ఐపీఎస్ లాంటి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి అధికారులు సైతం హిందీ భాష నేర్చుకొని దేశంలోని ఏ మూలలో అయినా ఉద్యోగం చేయగలుగుతున్నారు. కావున విద్యార్థులు చక్కగా బహుభాషలు నేర్చుకోవడం చాలా అవసరం అని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పద్య పఠనం, కవిత గానం మరియు డ్రాయింగ్ నందు పోటీలు నిర్వహించి వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కటారుపల్లి ఉపాధ్యాయులు విశ్వనాథ్ రెడ్డి,ఉపాధ్యాయులు ఓబుల్ రెడ్డి, పిటిఎం మురాద్ షా వలి,నరసింహారెడ్డి,లక్ష్మీనారాయణ రెడ్డి,ఉమ మహేశ్వర, రాజశేఖర్,రాజా రత్నం, ప్రసన్నలక్ష్మి, హరిప్రసాద్,బాబు, శేషు,తదితర ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆత్మీయులను కోల్పోయిన వేదనకు.. నష్టపరిహారమే ఆర్థిక ప్రాణవాయువు...!

- ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేక అవగాహన సమావేశం
- రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సహాయానికి పోలీస్ శాఖ వినూత్న చర్యలు
- బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక ఊరట ఎంతో అవసరం: జడ్జి ఎన్. రాజశేఖర్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు త్వరితగతిన ఇన్సూరెన్స్ నష్టపరిహారం అందడమే వారికి జరిగే సరైన న్యాయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ( డిఎల్ఎస్ఏ ) కార్యదర్శి, జడ్జి ఎన్. రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం ఎంతో అవసరమన్నారు.జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ డీఎస్పీ ఎం. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, ఏజెంట్లతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రమాద బాధితులకు ఇన్సూరెన్స్ పరిహారం అందడంలో జరుగుతున్న జాప్యాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. బాధిత కుటుంబాల పరిస్థితిని మానవీయ కోణంలో అర్థం చేసుకుని పరిహారం త్వరగా అందేలా ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు సహకరించాలని కోరారు.డీఎస్పీ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు ఇన్సూరెన్స్ పరిహారం అందేలా పోలీస్ శాఖ తరఫున వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టామని తెలిపారు. బాధితులకు పోలీస్ శాఖ నేరుగా అందుబాటులో ఉంటూ అండగా నిలిచే తొలి ప్రయత్నం ఇదని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇన్సూరెన్స్ క్లెయిమ్ ప్రక్రియ వేగవంతం అయ్యేలా పోలీస్ డాక్యుమెంటేషన్‌తో పాటు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.సమావేశంలో డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ వలీ బాషా, వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**గుంతకల్ - సూర్య వాస్తవం :** గుంతకల్ మండలం నరసాపురం గ్రామంలో శ్రీ ఆచార ప్రబోధా నంద యోగీశ్వరుల ఆశీస్సులతో లక్ష్మీనా రాయణ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మా ష్టమి వేడుకలను భక్తి శ్రద్దలతో ఘ నంగా నిర్వహించారు.గత కొన్ని రో జులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు,భజనలు,భక్తి కా ర్యక్రమాలు నిర్వహించారు.అనం తరం శుక్రవారం సాయంత్రం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరిం చి గ్రామంలోని ప్రధాన వీధుల్లో భక్తు ల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈ వేడుకల్లో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ద ర్శించుకుని భక్తులతో కలిసి ఊరేగిం పులో పాల్గొన్నారు.ఊరేగింపులో చి న్నారులు,మహిళలు,పెద్దలు ఉత్సా హంగా కోలాటాలు,భక్తి గీతాలతో గ్రా మ వీధుల్లో ఆధ్యాత్మిక వాతావర ణం నెలకొంది.భక్తులు శ్రీ కృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు.శ్రీకృష్ణాష్టమి జన్మదిన వే డుకల్లో భాగంగా శ్రీ ఆచార ప్రబోధా నంద యోగీశ్వరుల ఆశీస్సులతో కృ ష్ణ పల్లకి ఊరేగింపు కార్యక్రమంలో నరసాపురం గ్రామ ప్రజలు ప్రబోధ సే వా సమితి సభ్యులు మరియు తది తరులు పాల్గొనడం జరిగింది.ఎన్ నరసాపురం శాఖ సభ్యులు వహి అ ర్చన రాహుల్ మరియు చైతన్య కు మార్ ఎంతో వైభవంగా శ్రీకృష్ణ జ న్మాష్టమి వేడుకలు జరిపించారు.

# 1200 గ్రాముల గంజాయి, కారు స్వాధీనం

- నలుగురిని అరెస్ట్ చేసిన పోలీ సులు



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి కర్ణాటక నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ విక్రయి స్తున్న నలుగురు వ్యక్తుల ముఠాను గుత్తి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.ఈ ముఠా నుంచి 1200 గ్రా ముల గంజాయి,ఒక బ్రెజా కారును స్వాధీనం చేసుకున్నట్లు గుత్తి సి.ఐ రామారావు తెలిపారు. జిల్లాలోని గుమ్మగట్ట, బ్రహ్మసముద్రం, రాయదుర్గం ప్రాంతాలకు చెందిన ఎరుకల శ్రీనివా సులు,ఎరుకల సురేష్, వంశీ, ఎరుకల మంజునాథ్ అనే నలుగురు వ్యక్తులు కలసి కర్ణాటక ప్రాంతం నుంచి అక్రమంగా గంజాయిని కొనుగోలు చేస్తున్నారు. అనంతరం అనంతపురం, గుత్తి, గుంతకల్లు తదితర ప్రాం తాల్లో దానిని అక్రమంగా విక్రయిస్తూ అధిక సొమ్ము చేసుకుంటు న్నారు. పక్కా సమాచారం మేరకు గుంతకల్లు డీఎస్పీ ఎ.శ్రీనివాస్ ఉత్తర్వులతో గు త్తి సీఐ ఎం.రామారావు, ఎస్ఐలు కె.సురేష్,డి.అమీర్ ఖాన్,ఇతర సి బ్బంది రెవెన్యూ అధికారులతో కలి సి దాడి చేశారు.శుక్రవారం మధ్యా హ్నం 1:30 గంటల సమయంలో గు త్తి మండలం కొత్తపేట బ్రిడ్జి వద్ద ఎన్ హెచ్ -44 సర్వీస్ రోడ్డుపై కారులో ప్రయాణిస్తున్న ఈ నలుగురిని అదు పులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉ న్న నాలుగు ప్లాస్టిక్ కవర్లలోని 1200 గ్రాముల గంజాయితో పాటు,రవా ణాకు ఉపయోగిస్తున్న బ్రెజా కారు (ఏపీ 40- ఖ్- 9227)ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గుత్తి పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ (ఎన్డీ పీస్ )చట్టం కింద కేసు నమోదు చేసి నట్లు పోలీసులు వెల్లడించారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనకు ఇంటింటి సర్వే...

- దాగి ఉన్న కేసులను గుర్తించి సకాలంలో వైద్యం అందించాలి: డా. ప్రియాంక



**బెళుగుప్ప - సూర్య వాస్తవం:** కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని బెళుగుప్పలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బెళుగుప్ప సచివాలయం వద్ద డా. టి. ప్రియాంక ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు కొనసాగనుంది.ఈ సందర్భంగా డా. ప్రియాంక మాట్లాడుతూ.. ఎల్ సి డి సి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వే ద్వారా సమాజంలో దాగి ఉన్న కుష్టు వ్యాధి కేసులను గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని తెలిపారు. కుష్టు వ్యాధి అనుమానిత లక్షణాలు కనిపించిన వ్యక్తులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. శరీరంపై స్పర్శలేని తెల్లటి లేదా రాగి రంగు మచ్చలు కనిపించడం, నరాలపై ప్రభావం చూపడం వంటి లక్షణాలు కుష్టు వ్యాధికి సూచికలుగా ఉండవచ్చని తెలిపారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఎండీటీ చికిత్స ద్వారా వ్యాధి ఏ దశలో ఉన్నా చికిత్స పొందే అవకాశం ఉందని, కుష్టు వ్యాధి సోకిన వారు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.మాజీ హాస్పిటల్ డెవలప్‌మెంట్ చైర్మన్, టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ ఎల్ సి డి సి సర్వేను అన్ని గ్రామాల్లో సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఏఎన్ఎంలు, ఎం ఎల్ హెచ్ పిలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అనుమానిత కేసులను గుర్తించి, అవసరమైన వారికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిప్పయ్య, మాజీ సర్పంచ్ ఆవులన్న, రామ్మోహన్ చౌదరి, పారామెడికల్ అధికారి నీలకంఠ, సి హెచ్ ఓ పద్మావతి, హెల్త్ సూపర్వైజర్ కే. వెంకటరమణ, ఎం పి హెచ్ ఈ ఓ విజయ్ కుమార్, పి హెచ్ ఎన్ సరోజ, ఎం పి హెచ్ ఎస్ నాగమణి, ఏ ఎన్ ఎంలు రాధమ్మ, భాగ్యమ్మ, భారతి, ఎం ఎల్ హెచ్ పి భవాని, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలే వైసీపీ లక్ష్యం

- వైసీపీ శ్రేణులకు వైవీఆర్ దిశానిర్దేశం



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం రాబోయే మున్సిపల్ ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని,ఎ న్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్క రూ సమష్టిగా కృషి చేయాలని వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ గుంతకల్లు ని యోజకవర్గం మాజీ శాసన సభ్యు లు,నియోజకవర్గ ఇంచార్జ్ వై.వెంక టరామిరెడ్డి పిలుపునిచ్చారు.మంగ ళవారం టౌన్ లోని కె యం ఫంక్షన్ హాల్ నందు గుత్తి టౌన్ కన్వీనర్ అ ధ్యక్షతన మున్సిపల్ ఎన్నికల సన్న ద్ధతపై పార్టీ నాయకులు,ఆశావహ అభ్యర్థులతో ముఖ్య నాయకులు మహిళా నాయకురాలు కార్యకర్తల కు దిశానిర్దేశం సమావేశం నిర్వహిం చారు.ఈ సందర్భంగా వై.వెంకటరా మిరెడ్డి మాట్లాడుతూ రాబోయే ము న్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ నాయకులు,కార్యక ర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువకావాలని సూచించారు.ప్రతి వార్డులో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు,ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉం డాలని అన్నారు.ఎన్నికల్లో పోటీ చే యాలనుకునే అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రజలతో మమేకమై,వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపే తం చేయాలని దిశానిర్దేశం చేశారు. నాయకులు,కార్యకర్తలు ఐక్యంగా ప నిచేస్తే గుత్తి మున్సిపాలిటీలో వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగుర వేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గుంతకల్ నియోజకవర్గ యువ నాయకుడు సి బి మంజునాథ రెడ్డి,పార్టీ గుత్తి పట్టణ కన్వీనర్ గుత్తి పట్టణ మండలం మాజీ కన్వీనర్లు మాజీ జడ్పీటీసీమా జీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు మున్సి పాలిటీ వైస్ చైర్మన్, మహిళా నాయకురాలు, రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణం మండల పార్టీ వివిధ అను బంధ సంఘాల నాయకులు కమిటీ సభ్యులు వార్డ్ ఇన్చార్జులు బూత్ కమిటీ కన్వీనర్లు బూత్ కమిటీ స భ్యులు గుత్తి టౌన్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ ఎన్నికల ఆశావహ అభ్యర్థులు తది తరులు పాల్గొన్నారు.



# చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత



**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పట్టణంలోని పీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల యందు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ శుక్రవారం నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొని పరీక్ష వ్రాసారు. ఆగస్టులో జరిగిన పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రామ్ కుమార్ ఆధ్వర్యంలో నేడు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ను నిర్వహించారు. ఈ పరీక్ష సందర్భంగా జరిగిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్ కుమార్ చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నా పత్రాలను ఆవిష్కరించి పరీక్ష ప్రారంభించారు. జన విజ్ఞాన వేదిక పామిడి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ నిత్యజీవితంలో సైన్స్ ఆవశ్యకత, మూఢనమ్మకాలను పారదోరడం మొదలైన అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. తదుపరి పరీక్ష నిర్వహించడం జరిగింది. పరీక్షకు హాజరైన విద్యార్థులందరికీ బహుమతులు ప్రధానం చేశారు. మండల స్థాయి నుండి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి.ప్రభుత్వ పాఠశాలల విభాగంలో పామిడి ఏపీ ఆదర్శ పాఠశాల విద్యార్థులు సంపత్ కుమార్, రాంఆదిత్య, విఖ్యాతరెడ్డి, ప్రైవేట్ పాఠశాల విభాగంలో ఎస్ఎఫ్ఎస్ పాఠశాల విద్యార్థులు వర్షశ్రీ, అనంతలహరి, అఫ్తాబ్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామ్ కుమార్,జనవిజ్ఞానవేదిక మండల కన్వీనర్ రామ్మోహన్, సైన్స్ ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, రామాంజనేయులు, ప్రసాద్, రామకృష్ణారెడ్డి, ఇమ్రాన్ అలీఖాన్, భాస్కర, చంద్ర పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి జేపీ నడ్డాకు ఘన స్వాగతం...!

**జేపీ నడ్డాతో కొద్దిసేపు ముచ్చటించిన ఆదినారాయణ యాదవ్**



**అనంతపురం - సూర్య వాస్తవం :** రాష్ట్ర పర్యటన నిమిత్తం విజయవాడ విమానాశ్రయానికి విచ్చేసిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర వైద్య, విద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జీతో కలిసి ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు స్వాగతం పలికారు. అనంతరం జేపీ నడ్డాతో ఆదినారాయణ యాదవ్ కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్ర పర్యటన నేపథ్యంలో విజయవాడ విమానాశ్రయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర మంత్రికి స్వాగతం తెలిపారు.

# వైసీపీ నూర్ బాష దూదేకుల విభాగం జిల్లా ప్రెసిడెంట్‌గా గుత్తి షఫీ



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి వైసీపీ నూర్బాషా దూదేకుల విభాగం జిల్లా ప్రెసిడెంట్గా గుత్తికి చెందిన చిత్రసేడు షఫీని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. షఫీ మాట్లాడుతూ దూదేకుల ముస్లింల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చిన మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# స్థానిక ఎన్నికలకు ఓటర్ల జాబితా విడుదల...!

- ఉమ్మడి జిల్లాలో 63 జెడ్పీటీసీ, 847 ఎంపీటీసీ స్థానాలు
- అనంతపురం జిల్లాలో 13.52 లక్షల మంది ఓటర్లు
- శ్రీ సత్యసాయి జిల్లాలో 12.65 లక్షల మంది ఓటర్లు



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. అనంతపురంలోని ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి శుక్రవారం ఫొటో ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 63 మండలాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను ప్రకటించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 847 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈఓ తెలిపారు. గతంలో 841 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కొత్తగా కొన్ని స్థానాలు పెరగడంతో ఈ సంఖ్య 847కు చేరింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 25,18,110 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**అనంతపురం జిల్లాలో 31 జెడ్పీటీసీ స్థానాలు**

విభజిత జిల్లాలను ప్రామాణికంగా తీసుకుని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతపురం జిల్లాలో 31 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 450 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గతంలో 444 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కొత్తగా ఆరు స్థానాలు చేరడంతో సంఖ్య 450కి పెరిగింది. జిల్లాలో మొత్తం 13,52,193 మంది ఓటర్లు ఉండగా, వారిలో 6,78,835 మంది మహిళలు, 6,73,233 మంది పురుషులు, 125 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు.

**శ్రీ సత్యసాయి జిల్లాలో 32 జెడ్పీటీసీ స్థానాలు**

శ్రీ సత్యసాయి జిల్లాలో 32 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 397 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 12,65,917 మంది ఓటర్లు ఉన్నట్లు సీఈఓ వివరించారు. వీరిలో 5,99,112 మంది మహిళలు, 5,66,776 మంది పురుషులు, 29 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. ఫొటో ఓటర్ల జాబితాను జిల్లా పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శనకు ఉంచారు. మండలాల వారీగా ఓటర్ల జాబితాలను పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**మూడంచెల విధానంలో ఎన్నికలు?**

ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలను మూడంచెల విధానంలో నిర్వహించే అంశంపై ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే గ్రామస్థాయిలో సర్పంచ్, మండల స్థాయిలో ఎంపీపీ, జిల్లా స్థాయిలో జెడ్పీ చైర్మన్‌లను ప్రజలు నేరుగా ఎన్నుకునే అవకాశం ఉంటుంది. గతంలో అమలైన విధానంలో ఎంపీపీని ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీ చైర్మన్‌ను జెడ్పీటీసీ సభ్యులు ఎన్నుకునేవారు. కొత్త విధానంపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఆధారపడి ఉంటుంది.

# 'సూర్య వాస్తవం' కథనానికి స్పందన

- స్పందించిన అధికారులు
- ప్రింటర్లు ఏర్పాటు.... ప్రజలు ఇబ్బందులు తొలగింపు
- సమస్య తీరడంతో కనేకల్ ప్రజల హర్షం






**కనేకల్ - సూర్య వాస్తవం:** ప్రజా సమస్యలపై 'సూర్య వాస్తవం'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. కనేకల్ పట్టణంలోని మొదటి, రెండవ స్వర్ణ సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయకపోవడంతో వివిధ ధ్రువపత్రాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన పత్రాల ప్రింట్లు తీసుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఇటీవల 'సూర్య వాస్తవం' కథనం ద్వారా వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ సమస్యపై అధికారులు స్పందించి మొదటి, రెండవ స్వర్ణ సచివాలయాల్లో కొత్త ప్రింటర్లను ఏర్పాటు చేశారు. దీంతో సచివాలయాలకు వచ్చే ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తులకు సంబంధించిన ప్రింట్లు అక్కడే పొందే అవకాశం ఏర్పడింది. ఇప్పటివరకు ప్రింటర్ల సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పత్రాల కోసం బయట జిరాక్స్, ప్రింటింగ్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వచ్చేది. దీంతో అదనపు ఖర్చుతో పాటు సమయం కూడా వృథా అయ్యేదని ప్రజలు పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 'సూర్య వాస్తవం'లో సమస్యపై కథనం ప్రచురితమైన వెంటనే అధికారులు స్పందించి సచివాలయాల్లో ప్రింటర్లను ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభించిందని వారు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, అందుబాటులో ఉండేలా సచివాలయాల్లోని సాంకేతిక పరికరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతులు చేయడం లేదా ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


సూర్య
కనేకల్ సచివాలయం
XEROX
పనిచేయని ప్రింటర్లు...
- జిరాక్స్ సెంటర్లకు ప్రజల పరుగులు......
- సర్టిఫికెట్ల ప్రింట్ల కోసం జిరాక్స్ సెంటర్లకు ప్రజల పరుగులు
- సచివాలయాల్లో సౌకర్యాలు ఉన్నా ఉపయోగం లేకుండా పోతున్నాయంటున్న స్థానికులు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం...

సమస్యను పరిష్కరించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీశైలం ఖాళీ.. కారకులెవరు?




ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాలు రోజురోజుకూ తీవ్రం కావడానికి కేంద్ర జలశక్తి శాఖతో పాటు గోదావరి--కృష్ణా యాజమాన్య బోర్డుల క్రియారాహిత్యం కూడా ఒక కారణం. చట్టబద్ధత గల ఈ సంస్థలు ఆచరణలో పోస్టాఫీసు పని చేయడానికి అలవాటుపడ్డాయి. కేంద్ర జలశక్తి శాఖ నిమ్మకు నీరెత్తినట్లుంది. రాష్ట్ర విభజన చట్టం సబ్ సెక్షన్(1), సెక్షన్ 84 మేరకు అపెక్స్ కౌన్సిల్ ఎప్పటికప్పుడు రెండు నదీ యాజమాన్య బోర్డుల పని తీరును అజమాయిషీ చేయాల్సి ఉంది. నదీ బోర్డులపై అపెక్స్ కౌన్సిళ్లకు అధికారముందని మన ముఖ్యమంత్రులకూ తెలిసినట్లు లేదు. పన్నెండేళ్ల కాలంలో రెండుసార్లు మాత్రమే అపెక్స్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. దీనికి తోడు రెండు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలు పరస్పర విరుద్ధంగా ఉండటంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిరాసక్తిగా ఉన్న బోర్డులతో నిమిత్తం లేకుండా తమ అవసరాలు తీర్చుకుంటున్నాయి. ఫలితంగా ఎల్‌నినో ప్రభావం, రానున్న నీటి ఎద్దడి, వచ్చే వేసవి... వీటితో నిమిత్తం లేకుండా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు ఖాళీ చేస్తున్నారు.

ఈ ఏడాది ఎల్‌నినో వల్ల వర్షాలు పడవని, సాగునీటికి కాదు కదా, తాగునీటికి కూడా కటకటలాడాల్సి ఉంటుందని లోకం కోడై కూస్తున్నా.. కృష్ణానది యాజమాన్య బోర్డులో చలనం లేదు. నీటి సంవత్సరం జూన్ నుంచి ప్రారంభమైనా, ఇంతవరకు బోర్డు పూర్తిస్థాయి సమావేశం జరగలేదు. త్రిసభ్య కమిటీ అంటూ ఆ మధ్య ఒక సమావేశం జరిగింది. రెండు రాష్ట్రాల మధ్య పొంతన కుదరకపోవడంతో వాయిదా వేశారు. తిరిగి ఈ నెల నాలుగున అదే త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. ఒక దఫా త్రిసభ్య కమిటీ సమావేశంలో పొంతన కుదరనపుడు మళ్లీ త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయడం బోర్డు సభ్య కార్యదర్శి బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తోంది. నీటి సంవత్సరం మొదలై మూడు నెలలు గడుస్తున్నా బోర్డు చైర్మన్ ఏం చేస్తున్నట్లు?

ఇదిలావుండగా జల వివాదాల పరిష్కారానికి ఏర్పడిన కేంద్ర కమిటీ సమావేశం ఎజెండా పైనే కుస్తీ పడుతోంది. ఇటీవలి త్రిసభ్య కమిటీ సమావేశంలో రెండు రాష్ట్రాలూ ఎవరి వాదనకు వాళ్లు కట్టుబడగా, ఈ నెల ఆఖరు వారంలో బోర్డు సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఆంధ్రప్రదేశ్ నీటిని తరలించడం నిలిపివేయాలని తెలంగాణ చేసిన ఫిర్యాదును ఆంధ్రప్రదేశ్‌కు; తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తూ శ్రీశైలం నుంచి కిందకు నీళ్లు వదిలేస్తున్నదని ఆంధ్రప్రదేశ్ చేసిన ఫిర్యాదును తెలంగాణకు... యాజమాన్య బోర్డు పంపింది. ఈ పనికి చట్టబద్ధత గల సంస్థ అవసరం లేదు. కనీసం బోర్డు సభ్య కార్యదర్శి రెండు రాష్ట్రాలూ తమ అనుమతి లేకుండా ఎవరి వాటా ఎంతో తేల్చే వరకు ఆగాలని హెచ్చరించి ఉండవచ్చు. నీటి సంవత్సరం మొదలై మూడు నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయి బోర్డు సమావేశం జరగలేదు. అయినా రాష్ట్రాల ప్రజల అవసరాలు మాత్రం ఆగవు కదా? ఈ విషయంలో రాష్ట్రాలను తప్పు పట్టలేం. ఈ లోపు రాయలసీమలో తీవ్ర ఆందోళన మొదలైంది. ఈ ఏడాది సాగునీరు మాట అటుంచి, తాగునీటికి కూడా వలసలు పోయే దుస్థితి ఏర్పడుతుందని, శ్రీశైలం జలాశయం ఖాళీ చేస్తున్నారని ఆందోళనలు జరుగుతున్నాయి. సీమ వాసుల గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ నీటి సంవత్సరంలో వంద టీఎంసీలకు పైగా నీళ్లు వృథాగా పోయాయి. ఈ నెల 10 నాటికి శ్రీశైలం నీటిమట్టం 866 అడుగులకు చేరింది.

ఈ నెల నాలుగున త్రిసభ్య కమిటీ సమావేశం ముగిస్తూ అప్పటికి మేల్కొన్న బోర్డు సభ్య కార్యదర్శి... శ్రీశైలం నుంచి తెలంగాణ విద్యుదుత్పత్తి నిలిపివేయాలని, ఆంధ్రప్రదేశ్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల ఆపాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ ఏ రాష్ట్రమూ ఈ ఆదేశాలు పాటించడం లేదు. ఈ నెలాఖరు నాటికి శ్రీశైలం జలాశయం డెడ్ స్టోరేజీకి తెస్తారేమో! రోజూ ఇంచుమించు మూడు టీఎంసీల నీళ్లు కిందకు పోవడం గానీ, జలాశయం నుంచి ఎవరికి వారు వాడుకోవడం గానీ జరుగుతున్నది.

ఇదిలావుండగా ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇరిగేషన్ శాఖపై సమీక్ష చేస్తూ శ్రీశైలం జలాశయం నుంచి ఆంధ్రప్రదేశ్ మల్యాల, ముచ్చుమర్రి తదితర అవుట్‌లెట్ల నుంచి నీటిని తరలిస్తున్నందున తాము విద్యుదుత్పత్తి చేసేందుకు శ్రీశైలం జలాశయంలో నీళ్లు ఉండడం లేదని, అందుకు ఏపీ నుంచి పరిహారం కోరేందుకు ప్రస్తుతం విచారణ జరుపుతున్న ట్రిబ్యునల్ వద్ద ప్రస్తావించాలని తమ అడ్వొకేట్‌ను కోరారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ విద్యుదుత్పత్తి నిలిపివేస్తుందని భావించగలమా? దేశంలో పలు రాష్ట్రాలు ఉమ్మడిగా అనుభవించే ప్రాజెక్టులు ఉన్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల మధ్య ఏర్పడే ఉద్రిక్త పరిస్థితులు వీటి మధ్య లేవు. భాక్రానంగల్ ప్రాజెక్టును పంజాబ్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు ఉపయోగించుకుంటున్నాయి. సర్దార్ సరోవర్ ప్రాజెక్టును నర్మదా నదిపై గుజరాత్‌లో నిర్మించారు. దీన్ని రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఉమ్మడిగా ఉపయోగించుకొంటున్నాయి. బిహార్‌లో గండక్ ప్రాజెక్టును నిర్మించగా... బిహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్ ఉమ్మడిగా అనుభవిస్తున్నాయి. ఏపీ, తెలంగాణ లాగా ఈ రాష్ట్రాలు రచ్చకెక్కడం లేదు. నీళ్లతో రాజకీయాలు మిళితమైనందున తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి తటస్థించింది.

శ్రీశైలం జలాశయం నుంచి సెప్టెంబర్ 7న ఉదయం 7 గంటల వరకూ 49,649 క్యూసెక్కుల నీరు వాడుకొన్నారు. అందులో 16,371 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు చేరింది. 33,278 క్యూసెక్కులు అంటే 2.89 టీఎంసీలు రెండు రాష్ట్రాలూ వాడుకున్నాయి. సెప్టెంబర్ 7 నాటికి పై నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా ఆగిపోయింది. సెప్టెంబర్ 6న ఉదయం శ్రీశైలంలో 136.603 టీఎంసీల నీరు ఉండగా, అది ఏడో తేదీ ఉదయానికి 134.250 టీఎంసీలకు తగ్గింది. అది పదో తేదీ ఉదయానికి 127.283 టీఎంసీలకు పడిపోయింది. అంటే నాలుగు రోజులకు ఇంచుమించు 10 టీఎంసీలు ఖాళీ అయ్యాయి. యాజమాన్య బోర్డు సభ్య కార్యదర్శి ఆదేశాల తర్వాతనే ఇది జరిగింది. రాష్ట్ర విభజన జరిగిన అరవై రోజుల లోపు గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టం చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం తొలుత బోర్డుల నియామకానికే బాగా కాలయాపన చేసింది. ఈ లోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. రాష్ట్ర విభజన చట్టం సబ్ సెక్షన్ 8, సెక్షన్ 85లోనే యాజమాన్య బోర్డుల విధులు గురించి స్పష్టంగా ఉంది. ఏడేళ్ల తర్వాత 2021 జూలై 15న ప్రాజెక్టులను బోర్డులకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ ఈ రోజుకూ అమలు చేయలేకపోతోంది.

ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు ప్రాజెక్టులను స్వాధీనం చేయబోమని తెలంగాణ మొండికేసింది. శ్రీశైలం రిజర్వాయర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆధీనంలో, నాగార్జునసాగర్ రిజర్వాయర్ తెలంగాణ రాష్ట్ర ఆధీనంలో ఉన్నాయి. సాగర్ డ్యాం పైన రెండు రాష్ట్రాల పోలీసులు ఇంజనీరింగ్ అధికారులు మోహరించిన సంఘటనలు సాగునీటి చరిత్ర పుటల్లో మాయని మచ్చ. తుదకు శ్రీశైలం, సాగర్ రిజర్వాయర్లకు రూల్ కర్వ్‌ను (ఆపరేషన్ షెడ్యూల్) యాజమాన్య బోర్డు నిర్ణయించింది. ఇందులో శ్రీశైలం జలాశయం కనీస నీటిమట్టం 854 అడుగులుగా నిర్ణయించింది. రూల్ కర్వ్‌నకు మొత్తంగా తెలంగాణ ఆమోదం తెలపలేదు. కనీసం శ్రీశైలం జలాశయం రూల్ కర్వ్‌నకు ఇరు రాష్ట్రాలు అంగీకరించి ఉంటే ఈ ఏడాది ఈ పరిస్థితి ఏర్పడేది కాదు..